అభ్యుదయ

జూలై 1980

ఆ పాపను కాపాడండి !

ఈ యుద్ధం ఇక ఆపండి !!



ఒరియా కథ :

ప్రారంభోత్సవం

మూలం :
నందినీ శతపథి

తెలుగు :
మానేపల్లి సత్యనారాయణ

సమయం దగ్గరపడుతున్నకొద్దీ పూనా మనస్సులో ఆతృత అంతకంతకూ పెరుగుతోంది. యింట్లో ఏవో నాలుగు మట్టికుండ లున్నాయి. వాటిలో ఉల్లిపాయలనీ, ఉప్పనీ, పప్పనీ ఏవేవో వున్నాయి. గోడని రెండు కొయ్యలమీద ఒక చెక్క వుంది. పూనా ఉన్న నాలుగు వస్తువుల్నీ ఆ బల్లమీద చక్కగా పేర్చి ఒకసారి చూసుకుంది, సరిగ్గా ఉన్నదీ లేనిదీ. ఎందుకో సంతృప్తి కలగలేదు. మళ్ళీ సర్దింది.

ఇవ్వాళ చాలా పెందలాడే లేచి యిల్లంతా శుభ్రంచేసింది. నేలమీద ముగ్గులు పెట్టింది. సోనియా (భర్త) తనకి మిగిల్చి వెళ్ళింది, ఈ ఒక్కగదే.

సోనియా అనేసరికి ఎన్నెన్నో జ్ఞాపకాలు మనసులో ముసురుకున్నాయి. నాలుగేళ్ళ వైవాహిక జీవితం ఒక కలలా యిట్టే గడిచిపోయింది. ఎన్నో తీరని కోరికలు, ఎన్నెన్నో కష్టాలు .. ఒకో రోజు ఒకో పూట తిండే వుండేదికాదు. అయినా సోనియా పెదవులపై ఆ నవ్వు అలాగే వుంటుంది. సోనియా ఒక కూలీ. అతనికి రోజుకి ఎనిమిదణాల కూలీ, ఆ కాయకష్టానికి, సోనియావంటి ఆరోగ్యవంతుడు సైతం మంచంపట్టవలసిందే. అతను ఘోరమైన జబ్బుతో బాధపడేవాడు. రక్తం కక్కేవాడు. మూడు నెలల్లో చచ్చిపోయాడు. తిండి లేదు. జబ్బుకి మందులసలే రావు.

పూనా పొదుపుచేసి సొమ్ము కూడబెట్టింది. యిప్పుడు కొంచెం సంపాయిస్తోంది కూడానూ. రోజూ రెండు రూపాయలు కళ్ళజూస్తోంది. అంచేతనే కొంత డబ్బు కూడబెట్టింది. మొన్నొకరోజు ఒక గ్రామసేవిక వచ్చి చాలా చాలా చెప్పింది. దాంతో పూనా తన పేర పోస్టాఫీసులో సేవింగ్స్ ఎకౌంట్ ప్రారంభించింది. పూనా ప్రతినెలా ఒక్కర్తే పోస్టాఫీసుకు వెళ్ళి ఆ ఎక్కౌంటులో కొంత సొమ్ము వేస్తుంది. సోనియా బ్రతికివుంటే ఆ సొమ్ముతో హాయిగా యిద్దరికీ కాలక్షేపం జరిగిపోను. ఇప్పుడు పూనాకు ఉచిత వైద్యసదుపాయాలు, ఉచితంగా మందులు కూడా లభిస్తున్నాయి.

మొన్న సుశీల పెనిమిటి రఘుని పెద్ద

ఆస్పత్రికి కూడా పంపారు కంపెనీవారు. అతనికి కంపెనీవారు మందులకీ, మంచి ఆహారం తీసుకోవడానికీ, తగిన డబ్బు యిస్తారు. రఘు జబ్బు నయమై యింటి కొస్తాడని ఎవరూ అనుకోలేదు. కాని నాలుగు నెలలు తిరిగేసరికి రఘు బాగయి వచ్చి, పనిలో చేరాడు. అంతా తల్చుకుని— పూనా గట్టిగా నిట్టూర్చింది.

*   *   *

"మీరు కొన్ని చిత్రాలు కూడా పెట్టారా యింట్లో" అన్నా డొకాయన. పూనా గతుక్కుమన్నది, ఆ మాటలకి. కొందరు పెద్దమనుషులు పూనా వెనక నుంచుని చూస్తున్నారు యింతసేపూను. పూనా కొంచెం బుర్ర ఉపయోగించి, ఆలోచించి — ఒక పెద్ద ఆనకట్ట బొమ్మ వేసింది. నదిపై ఆనకట్ట, అక్కడొక పెద్ద జలాశయం, ఎలక్ట్రిసిటీ సరఫరా.... ఎన్నో గ్రామాలకూ పట్టణాలకూ వెలుగు వెల్లువ .... ఎన్నెన్నో పరిశ్రమలు కర్మాగారాలు .... పాఠశాలలు, ఆస్పత్రులు.... ఆ జలాశయం సమీపంలో కాలనీ, పిల్లలు యూనిఫారాలతో లైనుగా నిలబడి బడికి వెళతారు. పూనా మనసులో ఉన్న రంగులన్నీ చిత్రంలో ప్రతిబింబించాయి.

చిత్రంవేపు పెద్దమనుషులంతా అంతా చిత్రంగా, ఆశ్చర్యంగా చూస్తూ నుంచున్నారు. పూనా కూడా చిత్రం వేపే చూస్తోంది. పూనాలో ఎంత ఆలోచన.... నిజంగా! తన సృష్టికి తానే ఆశ్చర్యపోతోంది.

ఒకాయన అడిగాడు, "ఆ బొమ్మలో యింటిముందు ఒక తోట వెయ్యలేక పోయారా?"

పూనా సిగ్గుపడుతూ సమాధానం చెప్పింది. "నిజమే — కాని జాగా ఏదీ? పెద్ద పార్కు వేశానుకదా — చూశారా — అందులో పిల్లలంతా హాయిగా ఆడుకో వచ్చు...."

పట్టణం (కాలనీ) మధ్యలో పార్కు వేసింది.... ఆ పార్కులో ఉయ్యాల, జారుడుబల్ల, ఇలా ఎన్నెన్నో — ప్రతి మలుపులోనూ ఎలక్ట్రిక్ దీప స్తంభాలు..

ఒకాయన అన్నాడు: "ఈ చిత్రంలో కాలనీ తాలూకా ప్లాన్ చాలా బ్రహ్మాండంగా వుంది."

సంతోష్‌బాబు — కార్మిక నాయకుడు, అందుకున్నాడు: "నిజమే. తప్పకుండానూ. ఈ పల్లెటూరి ప్రజల్లో ఎందరు గొప్ప గొప్ప ఇంజనీర్లు దాగి వున్నారో!" అన్నాడు, పూనాను ఉద్దేశించి.

పూనాకి యిదంతా ఏం బోధపడలేదు. అందరూ తన యింట్లో అంతసేపు ఉండటంవల్ల ఎంతో సంతోషించింది. వాళ్ళని కూచోబెట్టడానికి యింట్లో చాప తప్ప యింకేమీలేదు. పూనా పడుతున్న ఇబ్బంది గ్రహించాడు సంతోష్‌బాబు.

"చూడమ్మా నువ్వేం ఇబ్బంది పడకు! నీతో ఓముక్క చెప్పి పోదామని వచ్చాం. చెప్పేసి వెళిపోతాం."

అంత పెద్ద పెద్ద ఆఫీసర్లకి ఏంపని వుంటుంది పూనాతో? పూనా కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

ఛీఫ్ ఇంజనీర్ అన్నాడు: "చూడమ్మా, ఇవ్వాళ యిక్కడున్న

ప్రాజెక్టు ప్రారంభోత్సవం. మేం ప్రధాన మంత్రిని ఆహ్వానించాం."

పూనాకు ఆశ్చర్యమూ, భయమూ కూడా వేసింది.

"ఏమిటి ప్రధాని వస్తానన్నారా? రానన్నారా?" అనడిగింది.

కొంప మునిగి ఆయన రాకపోతే ఈ ఏర్పాట్లన్నీ వ్యర్థం అయిపోవూ?

సంతోష్‌బాబు నవ్వాడు: "లేదు. తప్పకుండా వస్తారు. అసలు ఈ ప్రాజెక్టు కోసం ఎవరయితే నిజంగా చమటోడ్చి, రక్తం ధారపోశారో—వాళ్ళే దీనికి ప్రారంభోత్సవం చెయ్యాలని ఆయన ఉద్దేశం. నువ్వీ ప్రాజెక్టులో పనిచేశావుకదా మొదటినించీనూ—నువ్వే చేద్దూగాని ప్రారంభోత్సవం .."

ఏదో స్వర్గంలోంచి జారిపోతున్నట్టు తోచింది పూనాకి. ఇటు వంటి పెదపెద్ద ప్రాజెక్టులు మంత్రులు యితర గొప్ప వాళ్ళూ ప్రారంభోత్సవాలు చేస్తారట.... ఇదేమి టివ్వాళిలా అంటున్నారు?

* * *

ప్రధాన మంత్రి పక్కన నిలబడింది పూనా, కోలాహలం .... చప్పట్లు .... బ్యాండు మేళం....తనను తను మరిచిపోయింది. అంతా ఆమె వేపే పట్టిపట్టి చూస్తున్నారు.

ప్రజలు నినాదాలు చేస్తున్నారు.

ప్రధాన మంత్రికి జిందాబాద్ ....

ప్రధాన మంత్రికి జై ...

అందరినోటా వినబడే మాట అదే. ఎవరి మనసులోనూ మరో ఆలోచన లేదు. తాను ఏం చెయ్యాలో తనకే తెలియదు. అలా చూస్తూ వుండిపోయింది. ఆవిడ కళ్ళల్లో ఎన్నెన్నో అందమైన ముఖాలు కనపడుతున్నాయి. సోనియా, మధూభాయ్, బజఖోల్ .... పూనా విజయాన్ని ఉన్నతిని చూసి సంతోషిస్తున్నారు వాళ్ళు .. పూనా వాళ్ళముందు తలవంచింది వినమ్రంగా.

గాలి పిడికిలి బిగించింది

డా॥ ఆచార్య భావన్

గాలి పిడికిలి
బిగించింది
గుడ్లురిమింది
పళ్ళు పటపట కొరుకుతూ
ఒళ్ళు విరుచుకుంటూ
మీద పడబోతుంది
ఇంతకీ దానికి
కోపం ఎవరిమీదని?
ఇంకెవరిమీద — నా మనస్సు మీదే
ఎందుకని?
నా మనస్సు దానికన్నా వేగమైందని

కరిగిపోతున్న చీకటి ఆకాశం

కొల్లూరి

రాత్రి—
ఆకాశంనిండా చీకటి పేరుకుంది
తనలో చైతన్యాన్ని మొలిపించాలని
నక్షత్రాలు గుండెలు బాదుకంటున్నాయి
నక్షత్రాల గుండెల రోదన విన్న తూర్పు
కళ్ళు నలుపుకుంటుంది—
ఇంతలో—
చీకటి ముక్కలు ముక్కలై
నేల జారుతుంది
కరిగిపోతున్న చీకటి ఆకాశంలోంచి
వెలుగు దేహం బయటపడుతుంది।

కవయిత్రుల్లో మాత్రమే సామాజిక చైతన్యం

రచయిత్రుల మహాసభలు ఏర్పాటు చేయటంలో ఉద్దేశ్యం ఏమైవుంటుంది అని ఆలోచిస్తే - రచయిత్రులందరికీ గెట్ టుగెదర్ ఏర్పాటు చేయటమా, లేక పోతే రచయిత్రులు సాహిత్యంలోని మంచి చెడ్డలు తరచి చూసుకొని తమ రచనల్లోని లోపాలు సరిదిద్దుకునే అవకాశం కల్పించటమా లేకపోతే వచ్చిన ప్రేక్షకులకి సాహిత్యానికి సంబంధించిన విజ్ఞానం అందించటమా? నిజానికి వీటిలో ఏదీ ఆ సభలవలన జరగటంలేదు అనే అనిపించుతుంది.

అభిప్రాయ భేదాలతో స్టేజీమీదనే ముఖ్యంగా రచయిత్రులు ఒకరినొకరు దుయ్యబట్టుకోవటంకూడా తరచూ జరుగుతుంది. ఇలా ఎందుకు జరుగుతుంది? 'రచయిత్రుల మహాసభలు' అనే పేరులోనే ఉదాత్తత కనిపించుతుంది. అంత ఉదాత్తంగా సభలు జరగకపోవటానికి ఎవరిది కారణం?

భద్ర

ఈ సభలు నిర్వహించుతున్న అకాడమీవారు దేవతామూర్తులుగా తయారవుతున్నారు. వాళ్ళ చుట్టూచేరి భజనచేస్తూ వాళ్ళ ఆసరాతో తమలో టాలెంటు లేక పోయినా పైకి వస్తున్నారు కొందరు భజనపరులు. అంతో యింతో టాలెంటు ఉండికూడా భజనసంఘంలో చేరలేక పైకి రాకుండా అనామకంగా కడ బంతిని మిగిలిపోయేవాళ్ళు కొంతమంది.

ఇకపోతే బందరులో ఈసారి జరిగిన పదవ మహాసభల వివరాలు-మొదటిరోజు సమావేశానికి రావల్సిన వాళ్ళలో తురగా జానకీరాణి, వాసిరెడ్డి కాశీరత్నంగారలు రానేలేదు. తన సహజమైన తుపాను వాగ్ధాటితో ఆనందారామంగారు ఉపన్యసించారు. కె. వసుంధరాదేవి, డి. సుజాతాదేవి మిగతా వక్తలు.

రెండవ సమావేశం కవితగురించి జరిగింది. శ్రీమతి ఎ. లక్ష్మీరమణ అధ్యక్షతను శ్రీమతి శారదా అశోకవర్ధన్, శ్రీమతి ముక్తేవి భారతి, శ్రీమతి లలితా పీటర్స్, డాక్టర్ సుమిత్ర, శ్రీమతి సువర్చల ప్రసంగించారు.

మూడవది నవలగురించి శ్రీమతి తెన్నేటి హేమలత అధ్యక్షతను జరిగింది. లక్ష్మీకాంతమ్మగారు వేదికమీది ఆహ్వానితులను పరిచయం చేస్తున్నపుడు, లతని పరిచయం చేస్తుండగా ప్రేక్షకులలో ఒకరు 'రామాయణ విషవృక్ష 'ఖండన' అనే విశేషణం లతగురించి ప్రయోగించారు. శ్రీమతి రావి భారతి ప్రసంగం ప్రత్యేకించి విజ్ఞానాత్మకంగావుంది. తర్వాత చెప్పుకోదగినది శ్రీమతి ఐ. వి. ఎస్. అచ్యుతవల్లి ప్రసంగం. కుమారి జె. సుబ్బలక్ష్మి ప్రసంగం గురించి చెప్పాలంటే – ఆవిడ నేను నవలా రచయిత్రిని కాను. మరి పాఠకురాలిగా తన అభిప్రాయం చెప్పాలంటే ఉద్దేశంతో తనని పిలిచారేమోననే భావం మొదట వ్యక్తపరిచారు. అటువంటప్పుడు పాఠకురాలిగానైనా తనకెటువంటి నవలలు యిష్టమో, ఎందుకో అనైనా మాట్లాడాల్సింది. కానీ ఏదో పిలిచారుకదా అవకాశం వదిలేయటమెందుకన్నట్లు అప్పటి కప్పుడు అక్కడ వున్నవాళ్ళను రంజింపచేయటానికి మాట్లాడటం సభల సమయం ఆమేరకు వ్యర్థంకావడమే అయింది.

ఇంగ్లీషు రచయితలు ఏదైనా విషయాన్ని అర్థం చేసుకోటానికి చాలా శ్రమ పడతారని, మన రచయిత్రులు అలా చేయటంలేదని అన్న డాక్టరు సుమతిగారికి సమాధానంగా ఆనందరామంగారు – శ్రమపడటానికి ఇంగ్లీషు రచయితలకున్నంత అవకాశాలు తెలుగు రచయిత్రులకు లేవని చెప్పారు.

ఈమధ్య కొత్తగా మళ్ళీ రంగనాయకమ్మను రచయిత్రులు పుస్తకాలద్వారా సభలలోను ఖండించటం ప్రారంభమయినట్లుకూడా కనిపిస్తుంది.

శ్రీమతి లత అధ్యక్షోపన్యాసంలో బెంగాల్ రచయిత్రి ఆశాపూర్ణాదేవికి ఏవో రాజకీయ కారణాలవలన జ్ఞానపీఠ అవార్డు వచ్చింది కానీ ప్రజ్ఞవలన కాదని ఆరోపించారు. రేపు లతకి సాహిత్య అకాడమీ (జ్ఞానపీఠ అవార్డు రావటం కష్టం కనుక) ప్రైజు వచ్చినా అలాగే రాజకీయ కారణాలో, వ్యక్తిగత కారణాలో అనుకోవచ్చునా ?

శ్రీమతి లత సాహిత్య అకాడమీ బహుమతి వచ్చిన నవలలలోనే చాలా లోపాలున్నాయని చెప్తూ రంగనాయకమ్మగారి బలిపీఠం నవలలో 'స్వర్గీయ పొట్టి శ్రీరాములుగారిని కలుసుకోటానికి హీరో వెళ్ళాడ'ని రాశారని ఎత్తి చూపారు. కానీ తుఫాన్‌వంటి నవలల్లో ఆవిడకి లోపాలు కనిపించలేదా లేకపోతే ఎదురుగా శ్రీమతి ఆనందరామం ఉన్నారని ఊరుకున్నారా ?

పైపెచ్చు ఇప్పుడు చాలా మంచి నవలలు వస్తున్నాయని చెప్తూ వేదిక ఎదుట కూర్చున్న శ్రీమతి ఆనందరామం తుఫాన్‌ను, శ్రీమతి శారదా అశోకవర్ధన్ ఈమధ్య చాలామంచి నవలలు రాసారని ఉదహరించడంతో సమావేశం స్థాయిని చాలా కిందికి దించింది.

నాలుగవది 'సంఘం మీద సినీమాల ప్రభావం' ఇందులో ఎక్కువమంది రచయిత్రులు పాల్గొన్నారు. ఇందులో ముఖ్యంగా చెప్పుకోతగ్గది, శ్రీమతి

వేదవతిగారి వ్యాసం, తర్వాత కొండముది రుక్మిణీదేవిగారిది. వీళ్ళు సినీమాలకి సంఘానికి సంబంధించిన ప్రతీ విషయం వివరంగా చెప్పారు. కోడూరి లీలావతి గారు సినీమాలవలన ఎప్పుడు చూడని ప్రదేశాలు, డాన్సులు చూడగలుగుతున్నా మన్నారు. మొత్తంమీద అందరూ సినీమాలవలన యువతరం వెర్రితలలేస్తుందని విచారం వ్యక్తపరిచారు.

అందరివీ అయ్యాక శ్రీమతి లత అభిప్రాయం ప్రేక్షకలోకరు కోరారు 'ఇంత మందీ మాట్లాడారు కానీ తేల్చలేదంటూ స్టేజి'ఎక్కిన లత అందరూ శంకరాభరణాన్ని పొగడినందుకు చిరాకు వ్యక్తపరచి అందులోని టెక్నికల్ లోపాల్ని ఎత్తిచూపారు. 'రేప్‌లు ఉండకూడదని ఇంతమందీ అంటున్నారు. ఉంటే ఏమయింది ? అందులో త్రిల్ ఉండబట్టే అవి చూపుతున్నారు.' అన్నారు. అలా నలుగురవునన్నమాటను కాదనే అలవాటును లత మరోసారి వ్యక్తపరచుకున్నారు.

ఈ సమావేశమప్పుడు ప్రేక్షకుల్లోని మాటలుకూడా చెప్పాలి. శ్రీమతి లత వేదిక ఎక్కుతుండగా నా ప్రక్కనున్నామె "ఆమెకూడా రాస్తుందా ? ఎవరామె ?" అని అడిగింది. అంటే లతకి ఇప్పుడు అకాడెమీల్లో తప్ప పాఠకలోకంలో గుర్తింపు లేదన్నమాట వ్యక్తమవుతుంది.

మరొకటి నా వెనకన నాలుగేళ్ళ అబ్బాయి 'ఈనాటి సినిమా అంటున్నారు. ఇప్పుడు సినిమా చూపిస్తారా' అని వాళ్ళమ్మని అడుగుతున్నాడు. 'కాదు సినీమాలు చూడకూడద"ని చెప్తున్నారు.' అంది వాళ్ళమ్మ. 'ఎందుకు చూడకూడదు ? చూస్తే ఏమౌతుంది ?' అంటూ వేధించాడు. ఆ పిల్లాడ్ని వేదికమీదికి పంపుతే బాగుండేది. వాడిని ఎంతవరకూ సమాధానపరచగలరో తెలిసేది.

ఈ సమావేశంలో మరో సంఘటన స్టేజిమీద ఒకరు వ్యాసం చదువుతుండగా మొదటి వరుసలో కూర్చున్న రచయిత్రులందరూ ఒకరి చెవిలో ఒకరు గుసగుసలు చెప్పుకుంటూ సభాభంగం కలిగేలా నవ్వుకోడం. అప్పుడు వేదికమీద వాళ్ళకికూడా మొహాలు నల్లబడటం స్పష్టంగా కనిపించింది. ఆ నవ్వు ఆ టైములో లక్ష్మణదేవర నవ్వులా అపార్థం కలిగిస్తుందని తెలియని చిన్నపిల్లలా వాళ్ళు ? వాళ్ళలో సగం మంది ఉపాధ్యాయవృత్తిలో వున్నవాళ్ళే. వాళ్ళకికూడా తెలియదా మర్యాద ? తర్వాత లత ప్రసంగంవలన తెలిసింది – ముందువరసలోనే కూర్చున్న పైడిపాటి సుబ్బరామ శాస్త్రిగారు కునికిపాట్లు పడటం వాళ్ళ నవ్వులకి కారణం అని.

మరోవిషయం శంకరాభరణం ఉదహరించారు కాని సమాజానికి దర్పణాలైన మా భూమి, ఒకఊరి కథ, ఊరుమ్మడి బ్రతుకులు వంటివి ఉదహరించలేదు. బహుశా వాళ్ళు ఆ సినీమాలు చూడలేదేమో.

చివరిలో లక్ష్మీకాంతమ్మగారు వీరావేశంతో సినీమాలవలన జనం పాడయి పోతున్నందుకు పరితాపం వ్యక్తపరిచారు తమ సుదీర్ఘోపన్యాసంలో. ఈ సమావేశానికి డాక్టర్ ఆలూరి విజయలక్ష్మిగారు అధ్యక్షత వహించారు.

ఇక ఆఖరి సమావేశం కవి సమ్మేళనం – శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ అధ్యక్షతను జరిగింది. కార్యక్రమ నివేదిక ప్రకారము ఆహ్వానింపబడిన కవయిత్రు లను స్టేజిమీద చివరివరకూ అట్టే పెట్టి, టైమునకు టైమవుతుందన్న మిషమీద ప్రేక్షకులనుండి పేర్లు యిచ్చినవాళ్ళను చాలామందిని ముందు చదవనివ్వటం సభా మర్యాద అవునోకాదో లక్ష్మీకాంతమ్మగారికే తెలియాలి. అందరికీ ఆరు నిమిషాలు సమయం కేటాయించినాకూడా కొంతమంది ఇంకా ఎక్కువ సమయం తీసుకున్నారు. వాళ్ళలో ఆవకాయ కవయిత్రి శ్రీమతి సంజీవని. తర్వాత ఆఖర్న చదివిన అధ్యక్షులు శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ. మధ్యలో మండలి వెంకట కృష్ణారావుగారుకూడా మాట్లాడేరు.

మొత్తంమీద కథానికా నవలల గురించిన సమావేశాల్ని చూస్తుంటే స్వేచ్ఛా ప్రణయం, స్త్రీకి సంబంధించినంతవరకూ మాత్రమే రచయిత్రులలో అభ్యుదయ దృక్పథం కనిపిస్తుంది. వాళ్ళ రచనల్లో మళ్ళీ ఆ లవ్‌ట్రయాంగిల్, క్యాడిలాక్ కారు, ఆరడుగుల హీరోను వదలక పోవటం మనకి తెలిసిన విషయమే.

కానీ కవితాగోష్ఠి విన్నప్పుడు కొంత ఆశాజనకంగానే ఉంది. సగంమంది తమ కవితలు సామాజిక చైతన్యంతో కూడివున్నాయి. నవలలు, కథలూ రాసే రచయిత్రులకన్నా కవిత్వం రాసే రచయిత్రులు కొద్దోగొప్పో అభ్యుదయ భావాలు కలవారుగా అనిపించారు.

ఈ సభలకి ఆహ్వానింపబడినవారిలో చాలామంది అనామకంగా ఉండినవాళ్ళూ, కొత్తవాళ్లు కనిపించారు. కొత్తవాళ్ళకి అవకాశం ఇవ్వటానికి వాళ్ళని పిలిపించిఉంటే అకాడమీ వారిని అభినందించాలి.

ప్రేక్షకులందరికీ సాహితీపరంగా పరిచితురాలైన వ్యక్తి శ్రీమతి ఆనందా రామం ఒక్కరే. శ్రీమతి లత మాజీ రచయిత్రికిందే లెక్కని ఒక సమావేశంలోని పాఠకురాలి ప్రశ్నతో తేలిపోయింది. వీళ్లు ఆ మూడురోజులూ ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారు ఆ మూడురోజులు. వాళ్ళని రాసుకొని, పూసుకొని తిరుగుతే తమకికూడా కాస్త గుర్తింపు వస్తుందని చాలామంది అవస్థ పడ్డారు.

మొత్తంమీద సభలు జయప్రదంగా ముగిశాయి. అందుకు ప్రధాన కారకులను ప్రత్యేకించి అభినందించాలి. ఒక భార్యనో, ఒక తల్లినో, ఒక అక్కచెల్లెలినో ఆప్యాయతతో ఆదరించి మెప్పించలేని ఈ రోజుల్లో ఇంతమంది ఆడవాళ్ళని నిష్పక్షపాతంగా అభిమానంతో ఆదరించి మెప్పించిన స్పందన సాహితి వాళ్ళని అభినందించక తప్పదు.

సాయం కోసం

వెర్రిబాబు

గవురవనీయులయినటువంటి ప్రధాన మంత్రి గారికి నేను నమస్కరించి రాయుచున్నది.

నేను అయిదో తరగతి పేసయ్యాను. పేసయ్యిన రోజున మా హెడ్డుమాష్టారు నన్ను కేకేసి ఒరేయ్ శీనూ నీకు స్కూలు ఫష్టువచ్చిందిరా బాగా చదువుకో పెద్దోడివయ్యాకా బాగుపడతావ్' అని చెప్పి ఒక మంచి పెన్ను ఇచ్చారు నాకు. నాకు బలే సంతోసమేసింది. ఆయన చాలా మంచోరు నన్నెప్పుడూ కొట్టేవారుకాదు. ఆయన బట్టీ పట్టమన్న పాఠాలు కచ్చితంగా బట్టీగా చదివి అప్పగించేవాన్ని. ఆయన చెప్పిన పనల్లా చేసే వాన్ని. అంచేత నేనంటే ఆయనకు మంచి ఇష్టం. మాష్టారు పెన్ను యిచ్చారని చెప్పి, అయి స్కూల్లో రేపే చేరిపించమనిచెప్పాను మానాన్నతో మాటలాడలేదు. సంతోసంగా బయటకెళ్ళిపోయాను నేను.

తరవాత రోజున "ఒరేయ్ శీనూరారా' అని కేకేసాడు మా నాన్న. ఉతికిన బట్ట లేసుకుని మా నాన్నతూడా వెల్లాను. సావుకారు కొట్టుదగ్గర కెళ్ళాడు మానాన్న పుస్తకాలు కొంటాని కనుకొని 'అప్పుడే పుస్తకాలెందుకు స్కూల్లో చేరాకా మాష్టారు చెప్పిన పుస్తకాలు కొనుక్కోచ్చు' అన్నాను. మా నాన్న నాకేసి అదోలా చూసాడు నావంక 'ఇయ్యాల్ట నుంచి నువు యీ కొట్లోనే పనిచెయ్యాలి, రోజూ వచ్చి సావుకారు చెప్పిన పనల్లా చెయ్యాలి అర్థమైందా?' అన్నారు మా నాన్న-గుండాగినంత పనయ్యింది నాకు. 'అయితే అయిస్కూల్లో చేర్పించవా?' అన్నాను. 'మనలాంటోళ్ళకి చదువులెందుకురా? చిన్నప్పట్నించీ నేర్చుకుంటే పెద్దోడివయ్యాక బాగుపడతావ్, ఆయన చెప్పినట్టల్లా చెయ్యి, మావోడికి రెండు జంతికలివ్వండి సావుకారుగారూ' అని చెప్పి వెళ్ళిపోయాడు మానాన్న నాకు ఏడుపొచ్చింది ఏం చెయ్యను?

ఇంటికొచ్చాక మా అమ్మదగ్గర ఏడుపు మొదలెట్టా. మా నాన్న వచ్చాక నన్ను చదివించమని చెప్పింది మా అమ్మ. 'నా కొచ్చే జీతంతో మిమ్మల్నే పోషించలేక పోతున్నాను. మళ్ళీ వీడి పుస్తకాలకి, ఫీజులకి. ఎక్కడి నుంచి తేను?'అన్నాడు మా నాన్న. అన్నట్టు రాయటం మర్చిపోయాను. మా నాన్న మా వూరి గ్రామ

నౌకరుగా పనిచేస్తున్నాడు. ఆయనజీతం చాలా తక్కువట. మానాన్న అప్పుడప్పుడు అంటాడు, "నాకన్నా కూలోడికి ఎక్కువ జీతమొస్తది" అని. నేను చదివించమంటూ మంకుపట్టు పట్టాను. మా నాన్న కోపంగా రెండు దెబ్బలేసి 'ఛీఛీ మధ్య తరగతోడు కుటుంబంలో చచ్చినా పుట్టకూడదు'. అంటూ రోడ్డు మీద కెళ్ళి పోయాడు.

మరునాడు సావుకారు కొట్టుదగ్గర కెళ్ళి పనిలో చేరాను. చెప్పిన సరుకల్లా తెచ్చి అందిస్తున్నాను. నిన్న బెల్లం అందివ్వమన్నాడు. బెల్లాన్ని చూసేటప్పటికి నా నోరూరింది. రోజూ మా అమ్మ బడికెళ్లేటప్పుడు చిన్న ముక్క పెట్టేది, చిన్న ముక్క విరిసి నోట్లో పెట్టుకున్నానో లేదో అప్పుడే మా సావుకారు రావటం, నా వీపుమీద నాలుగొడ్డించటం జరిగి పోయాయి. 'పట్రామన్న ప్రతి సరుకూ ఇలా తింటూ కూర్చుంటే నాయిల్లుగుల్లయి కూర్చుంటది' అంటూ వెళ్ళిపోయాడు. ఏడుస్తూ ఇంటి కెళ్ళి చెప్పాను.' నిన్ను కొట్లో పెట్టింది బెల్లం తింటానికి కాదు, జీతానికి' అంటూ మా బాబయ్య మళ్ళీ నాలుగొడ్డించాడు;

ఇయ్యాల పొద్దున్న మా షావుకారు ఏవో సరుకులు పట్రామన్నాడు. సరుకులు పట్టుకుని పరధ్యానంగా వెళుతున్నాను నాకాలు తగిలి నూనెడబ్బాలో కొద్దిగా వున్న నూనె కాస్తా ఒలికిపోయింది. అంతే నా వీపుమీద వరుసగా దెబ్బలు పడుతున్నాయి. మా సావుకారు కొడుకు రాంబాబు వచ్చి నన్ను లోపలికి లాక్కెళ్ళి పోయాడు.

'ఏడుస్తా వెందుకు? కొట్లో పని చెయ్యటం నీకిష్టంలేదా?' అన్నాడు.లేదని తలూపాను.

"మరేం చెయ్యాలనుంది?"

"చదువు కోవాలని"

"మరేం?"

"మా నాన్న చదివించ లేనన్నాడు."

"అయితే ఒక పనిచెయ్యి నన్ను చదివించమంటూ ప్రధాన మంత్రిగారికో లెటరు రాయి."

అర్థం కాక అతనివైపు చూసాను.

"నువ్వు స్కూలు మానేసినప్పటి నుంచి యిప్పటి వరకూ జరిగినదంతా ఒక తెల్లకాగితము మీద రాసి "నన్ను చదివించే ఏర్పాటు చేయండి" అని రాసి ఈ కవరులో పెట్టి పోస్టు బాక్సులో పడెయ్యి" అంటూ లోపలికెళ్ళి ఒక పొడుగుపాటి కవరుతెచ్చి దాని మీద ఇంగ్లీషులో ఏదోరాసారు. 'అలాగే' అంటూ తలూపాను నేను. అదోలా నవ్వుతూ వెళ్ళిపోయాడు రాంబాబు.

ఇంటికొచ్చి మా మాస్టారు ఇచ్చిన పెన్నుతో ఈ ఉత్తరం రాస్తున్నాను. ఈ ఉత్తరం అందినవెంటనే మీరు నన్ను చదివించే ఏర్పాటు చెయ్యండి. చేస్తారనుకొంటున్నాను. మీరు నన్ను చదివించలేనట్టయితే నేను చదువుకోకుండా ఇలా సావుకారుదగ్గర పనిచెయ్యటానికి కారణమెవరో రాయండి. అతనికి వెంటనేనన్ను చదివించమంటూ ఉత్తరం రాసాను. ఇందులో బోలెడన్ని తప్పులుండొచ్చు. ఉంటాయి. ఎక్కువ తప్పులుండవనుకుంటాను. మా మాస్టారు నా రాతచూసి 'అస్సలు తప్పులు లేకుండా బలేరాస్తావురా

కృషీవలుణ్ని నేను!

ఖ్రమొద్దీన్

వుబుసుపోక
కలం పట్టిన
వృత్తి కవినని
తెల్లకాగితానికి
నేనంటే అలుసు....!
కానీ—
నిజానికి నేను
"వృత్తి" కవిని కాను!—
ఇన్ని కిరణాలు ధారపోసి,
ఏ గుర్తింపులేని చంద్రుడికి
ఓ గుర్తింపూను సాధించి పెట్టిన
సూర్యుడికి మల్లె
దస్త్రాలకు దస్త్రాల అడుగున
అణగారిపోతూ
తెల్లగా పాలిపోయిన
తెల్లకాగితాన్ని పైకితీసి,
చల్లచల్లగా కథలూ కవితలూ రాసి
బ్రతుకు పండించే
కృషీవలుణ్ని!

మూసీనదిలో

దేవి

కాలే కడుపులూ
మండే గుండెలూ
పెట్టుకున్న మెమొరాండం
మూసీ నదిలో ముక్కుమూసుకుంది!
కూడూ గుడ్డా
యివ్వలేని అధికారం
అన్ని కలల్నీ తుదముట్టిస్తుంది!!
పనీ పాటా
కల్పించలేని ప్రభుత
ఎన్నికలలో కలవరిస్తుంది!!!

అందని బస్సు

వసీరా

చాలాకాలంనుంచి పరుగెడుతున్నాను
కాలం కంకర రోడ్డుమీద
బ్రిటిష్ విద్యావిధానం బస్సు వెనకాల
అది నా కంట్లోనూ నోట్లోనూ
దుమ్ముకొడుతూ పోతోంది

నువ్వు, పులుస్టాపులు, కామాలు కూడా చాలా కరెక్టుగా పెడతావు. రాతకూడా చాలా అందంగా ఉంటుంది' అంటూ ఆరెండెన్నొ రిజిస్టరులు నాచేతే రాయించేవాడు. తప్పులుంటే ఏమీ అనుకోకండి మరి నమస్కారం.

మీ సాయం కోసం ఎదురు చూస్తూ—

శీనుబాబు.

* * *

స్టాంపులు అంటించకుండా, ఫ్రమ్ అడ్రస్ లేకుండా, గమ్మత్తయిన ఎడ్రసుతో వచ్చిన ఈ కవరును తప్పు అని తెలిసినా, ఆతృతను చంపుకోలేక చింపేను నేను. ఎడ్రసు మళ్ళీ ఒకసారి చదవటం మొదలెట్టాను.

"టూ,
ప్రైమ్ మినిస్టర్,
ఢిల్లీ.

స్టాంపులంటించి పంపితేనో అని నాను? పోస్టుమాస్టర్ గిజగిజ లాడాడు.

ఆ కుదురైన అక్షరాల వెనక కొట్ల మంది బాల బాలికలు కదిలిపోతున్నట్టనిపించింది.

నీళ్ళుబికిన నా కళ్ళకి.

రచయిత - సమాజం

ఇల్యా ఎహ్రెన్‌బర్గ్

అన్ని యుగాలలోనూ రచయిత స్వప్నం - మానవుని కాపాడటం. అతడు యాంత్రికంగా ఘటనలను నమోదుచేసే యంత్రంకాదు. అతని భావాలను, ఆవేశాలను, జీవితాన్ని, రచనలను సాంఘిక పరిసరాలు నిర్ణయిస్తూంటాయి. తన పరిసరాలకు, తన సమాజానికి, దూరమయితే, రచయిత సృజనాత్మక కళ విషయంలో శుష్కించి చనిపోతాడు. వాస్తవిక సాహిత్యం ఎప్పుడూ సమాజ జీవితంతో సంబంధంకల్గి ఉంటుంది. రచయిత ఒంటరిజీవి అనడం, "గదులు కట్టుకుని" నివసిస్తాడనడం సరికాదు: అట్టి భావాలు బూర్జువా సమాజం క్షీణించడం మొదలు పెట్టగానే ప్రారంభమయ్యాయి; ప్రపంచ పరిణామం పూర్తిఅయిందని నవలా రచయితలు తలచినపుడు, వాస్తవానికి బదులు స్వప్నాలు రావాలని వారు నిర్ణయించినప్పుడు పైనచెప్పిన భావాలు ఆరంభమయ్యాయి (స్వప్నాలు వాస్తవాన్ని ప్రతిబింబించవచ్చు. అయితే అవి వక్రప్రతిబింబాలు).

రచయితలు బాగా రాయాలంటే ఏంచెయ్యాలన్న కొందరి ప్రశ్నకు టాల్‌స్టాయ్ విలువైన రెండు సలహా లిచ్చాడు.

1. నీక్కూడా అభిరుచి కల్గించని వాటిని గూర్చి రాయబోకు.

2. పుస్తకం రాయాలని నీకు ఉద్దేశం వుండి కూడా, దానిని రాసితీరాలి అన్న భావం నీలో కల్గకపోతే, అసలు రాయడమే మానుకో.

రచయితలు వినోదంకోసం, పేరుప్రతిష్ఠలకోసం రాయరు. ప్రజలను బాగుచేయాలని, జీవితాన్ని మరింత ఉన్నత పథాలకు నడపాలని రచయిత భావిస్తాడు. ఈ పోరాటంలో పుస్తకాలను ఒక నైతిక ఆయుధంగా రచయిత ఎంచుతున్నాడు. చారిత్రక క్రమగతుల అవగాహన, మానవజాతి భవిష్యత్తును గురించిన స్పష్టమైన అభిప్రాయమూ అభ్యుదయ రచయితలో విశాలదృష్టిని కల్గిస్తాయి.

రచయితలో ఉద్వేగం (Passion) లేనిదే నిజమైన కళ లేదనీ - ఉండబోదనీ నా నమ్మకం. ఈ మధ్య మనం కొన్ని పదాలను వాడడం మర్చిపోయాం. అవి - ప్రబోధం - ప్రేరణ - సేవ మొదలైనవి. ఇవి నవ్వుపుట్టించేవీ - డుల్ల పదాలూ కావు. రచయితయొక్క విధ్యుక్తధర్మాల్ని నిజంగా అర్థంచేసుకోడానికి ఉపయోగపడే పవాలివి. తనకున్న కొద్దిపాటి జీవితంలో రచయిత అనేక జీవితాలు గడపాలి. ప్రజల హృదయాలలో ఉత్సాహం రేకెత్తించాలి. అలా చేయడానికిగాను మానవుని ఆంతరంగిక ప్రపంచంలో వెలుగును ప్రసాదించి, పాఠకుడు దానిని మరింత స్పష్టంగా చూడడానికీ, సమగ్రంగానూ, సగర్వంగాను జీవించడానికీ రచయిత తోడ్పడాలి. రచయితకు మానవుల ఆంతర్యాన్ని చూడగల నైపుణ్యం ఉండాలి. అది అతనికుండవలసిన ముఖ్యస్వభావం. ప్రజలంటే అభిరుచి - ప్రేమ - ఇతరులనుండి గ్రహించే స్వభావం మొదలైనవీ రచయిత స్వాభావిక లక్షణాలు.

కడపలో

సాహిత్య విమర్శపై సదస్సు

ఆగస్టు 15–16 తేదీలలో కడప ప్రభుత్వ (మెన్స్) కళాశాలలో అరసం ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయిలో 'సాహిత్య విమర్శ'పై సదస్సుకు సన్నాహాలు సాగుతున్నాయి.

పులివెందుల శాసనసభ్యులు డా. వై. ఎస్. రాజశేఖరరెడ్డి అధ్యక్షులుగా, కడపజిల్లా అరసం అధ్యక్షులు శ్రీ వై.సి. వి. రెడ్డి కార్యదర్శిగా ఇంకా జిల్లాలోని విఖ్యాతరచయితలు కవులు విమర్శకులతో బాటు అభ్యుదయ రచయితల సంఘం ముఖ్యులు బాధ్యులు అందరితో ఆహ్వాన సంఘం ఏర్పడుతుంది.

రాష్ట్రంలో అరసం బాధ్యులు, సభ్యులు, సాహిత్యాభిమానం ఉన్న మిత్రులు అందరూ ఈ సదస్సుకి ఆహ్వానితులే. ప్రత్యేకంగా ఆహ్వానాలు సకాలంలో పంపలేకపోయినా ఈ ప్రకటననే ఆహ్వానంగా స్వీకరించి సదస్సులో పాల్గొనాల్సిందిగా అందరికి కార్యదర్శి శ్రీ వై.సి.వి. రెడ్డి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆహ్వానసంఘం విజ్ఞప్తి

సాహిత్య విమర్శ అంటే ఏమిటి? విమర్శ పేరుతో ఇంత హడావుడి ఎందుకు? అని చాలామందికి ఆశ్చర్యం కలగడం సహజం. విమర్శ సాహిత్యావిర్భావానికి దోహదం చేస్తుంది. ఉత్తమ విమర్శ ఉత్తమ సాహిత్య సృష్టికి తోడ్పడుతుంది.

సాహిత్యం పుట్టిన తరువాత దాని లక్షణ రూపంలో విమర్శ పుడుతుంది. దాన్ని అనుసరించి లక్ష్యంగా సాహిత్యం అవతరిస్తుంది – అందువల్ల విమర్శ-సాహిత్యం రెండూ పరస్పర దోహదకారి అయిన విశిష్ట అభివర్గం [కేటగిరి].

ఇప్పుడు వస్తున్న సాహిత్యం తీరు తెన్నుల్ని విశ్లేషించడం ఇంతకన్నా మంచి సాహిత్యం పుట్టడానికి అనువైన పద్ధతుల్ని సూచించడం ఆశయంగా అభ్యుదయ రచయితల సంఘం సాహిత్య విమర్శపై ఈ సదస్సుని సంకల్పించింది. సాహిత్య విమర్శమీద సదస్సు జరపాలంటే కడప మాత్రమే అందుకు తగ్గ కేంద్రమని తెలుగు దేశానికంతకీ తెలుసు.

సాహిత్య ఆధునిక విమర్శకు జీవం పోసిన విఖ్యాత విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డి శతజయంతి సందర్భంగా ఈ సదస్సును ఆయన గౌరవార్థం అంకితం చేస్తున్నారు.

సదస్సు ప్రాంగణానికి కట్టమంచివారి పేరు, సదస్సు జరిపే ఆడిటోరియంకు

కీ.శే. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి పేరు పెడుతున్నారు.

ఈ సందర్భంగా రూపొందించిన వ్యాసాలలో అభ్యుదయ విశేషసంచికను కట్టమంచివారి చిత్రంలో వెలువరిస్తారు.

అరసం ఈ సంవత్సరంలో ఇప్పటికి నవలపై - ఉన్నవ వారికి అంకితంగాను, భాషపై గిడుగుకి అంకితంగాను సదస్సులు నిర్వహించి విశేష సంచికల్ని వెలువరించిన విషయం తెలుగు సాహిత్య లోకానికి తెలిసిందే. సాహిత్య విమర్శ సదస్సులో విమర్శనా భేదాలు, ప్రాచీన విమర్శన పద్ధతులు, విమర్శ వ్యాసరచనా పద్ధతి, రూపం-వస్తువు, విమర్శ భావ వాద పలాయనవాద దోరణులు, మార్క్సిస్టు విమర్శనాపద్ధతి, ఆధునిక సాహితీ ధోరణులు, విమర్శ - చారిత్రక దృక్పథం, విమర్శ తులనాత్మక పద్ధతి, విమర్శ కావ్యాలు, గ్రంథ సమీక్షలు తదితరాలపై పత్రాల సమర్పణ, చర్చ జరుగుతుంది.

ప్రొఫెసర్ కొత్తపల్లి వీరభద్రరావు (సెంట్రల్ యూనివర్శిటీ) డా. ఎస్. వి. రామారావు (ఉస్మానియా యూనివర్శిటీ) డా. కె. కె. రంగనాథాచార్యులు (ఓరియంటల్ కాలేజి) డా. బూదరాజు రాధాకృష్ణ (తెలుగు అకాడెమి) రాచమల్లు రామచంద్రారెడ్డి, రాంభట్ల కృష్ణమూర్తి, డా. కేతు విశ్వనాథరెడ్డి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, నల్లపాటి రామప్ప నాయుడు, చేకూరి శ్రీనివాసరావు, జి. అశ్వత్థనారాయణ ప్రభృతులను పత్రాలు రూపొందించాల్సిందిగా అర్థించడం జరిగింది. ఇప్పటికే పత్రాలు కొన్ని సిద్ధమైనాయి.

ఆగస్టు 15వ తేదీ శుక్రవారం ఉదయం 10 గం॥లకు సదస్సు ప్రారంభోత్సవ సమావేశం ఉంటుంది. అప్పుడే కొన్ని పత్రాలు సమర్పిస్తారు. మధ్యాహ్నం 3 గం. నుండి మరికొన్ని పత్రాల సమర్పణ, చర్చ ఉంటుంది. రెండవ రోజు ఉదయం 9.00 నుండి కార్య క్రమం ఆరంభమవుతుంది. ఉదయం, అలాగే మధ్యాహ్నం 3 గంటల నుండి జరిగే సమావేశంలోనూ కూడా పత్రాల సమర్పణ చర్చ కొనసాగిస్తూ 7 గం.లకు ముగింపు సభ జరుగుతుంది.

చర్చలలో నిష్కర్షగా నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలు చెప్పడం ద్వారా సాహిత్యవిమర్శనాభివృద్ధికి తోడ్పడాల్సిందిగా అభ్యుదయ రచయితల సంఘం అందరినీ వినమ్రంగా ఆహ్వానిస్తున్నది,

ఇతర సాహిత్య సంఘాలకు చెందిన వారు కూడా చర్చలలో పాల్గొనడాన్ని అరసం సాదరంగా ఆహ్వానిస్తుంది. ప్రతినిధి రుసుము పది రూపాయలు. ప్రతినిధులకు అతిధులకు అందరికీ భోజన సదుపాయాలు ఆహ్వాన సంఘం ఏర్పాటు చేస్తున్నది. వసతికూడా కనీస సౌకర్యాలతో చూపడం సాధ్యమౌతుంది.అయితే ప్రత్యేక ఏర్పాట్లు కావాలనుకున్నవారు ఖర్చులు వారే భరించుకోవాల్సి ఉంటుంది వారంరోజుల ముందుగా తెలియపరిస్తే వారికి హోటళ్ళలో బస రిజర్వు చేయడం సులువవుతుంది.

వివరాలన్నిటికీ: వై. సి. వి. రెడ్డి, సాహిత్య విమర్శ సదస్సు ఆహ్వానసంఘ కార్యదర్శి, 2/76 ఎ. నాగరాజుపేట కడప-516001.

గ్రంథ సమీక్ష

డా. నాయని కృష్ణకుమారి : 'పరిశీలన'(వ్యాససంకలనం)

ప్రాచీన కవుల, రచయితల రచనలను బట్టి, యిది ఫలానా కవి లేదా రచయిత వ్రాసిందని చెప్పవచ్చు. ఒక్కొక్కరి రచనా సంవిధానం ఒక్కొక్క రకంగా ఉంటుంది. ఒకే రచయిత వివిధ రకాలుగా ఆయా కాలమాన పరిస్థితుల కనువుగా వ్రాస్తే, ఆ రచయిత రచనలపై కాల ప్రభావ పరిణామాన్ని చెప్పవచ్చు. ఇది శైలిలో వచ్చే వైవిధ్యం.

డాక్టరు నాయని కృష్ణకుమారిగారి "పరిశీలన"ను పరిశీలిస్తే, చప్పున కనిపించేవి, చప్పున తోచేవి రెండు విషయాలు. మొదటిది, 1949 నుండి 1976 వరకు ఆమె వివిధ విషయాల గురించి పరిశీలనాత్మకంగా రచనలు సాగించారనేది. రెండవది, 1949 నుండి 1976 దాకా గ్రాంధిక భాష ఎలా రూపుమార్చుకొంటూ వ్యావహారిక భాషగా అవతరించి విశ్వవిద్యాలయ స్థాయిలో కూడా తిష్టవేసుకుందో తెలుస్తుంది. ఈ పరిణామ దశను గమనించాలంటే, విశ్వవిద్యాలయంలో విద్యార్థినిగా. ఆ తర్వాత అధ్యాపకురాలుగా ఉంటూ, గత30ఏళ్ళు సాగించిన సాహిత్య కృషికి యీ గ్రంథం దర్పణం పడుతున్నది. ఈ వ్యాస సంకలనం, యీ మూడు దశాబ్దాల సాహిత్య విలువల్నీ, భాష-దాని పరిణామ ప్రభావాన్నీ సంకేత మాత్రంగా తెలియజేస్తున్నది.

ఈ గ్రంథంలో మొదటిది "రెండవ తారికలు - ఒక ఫలశృతి" (1949)లో నన్నయ తిక్కనల రచన గురించి ఎం.ఏ విద్యార్థినిగా వ్రాశారు. బహుశా, అప్పటి వారి గురువుల ప్రభావం రచనపై ఎక్కువ ఉండి ఉంటుంది. "ప్రబంధ కాలపు ప్రజలు" (1949) కూడా దాదాపు అంతే. ఐతే, పరిశీలనా దృక్పథం, కొత్త విషయం చెప్పాలన్న ఆరాటం వ్యాస సంవిధానంలో కొంత కనిపిస్తుంది "కల్పవృక్షము, కైకేయి" (1957) లో, శ్రీ విశ్వనాథపై రచయిత్రికి గల అభిమానం, భాషా సాహిత్యాలపై ఆమెకు గల ఒడుపు కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. విశ్వనాథ ఆశయాన్ని ఆమె యిలా చెప్పారు: "ఈ లోపము ఆయా కవుల ప్రతిభాలోపము వలన కలిగినదికాదు. వారు రామాయణమును ధర్మ ప్రధాన కావ్యముగా చెప్పిరి. కాని, సరస ప్రబంధముగా జెప్పలేదు. అట్లు విశ్వనాథ చెప్పెను. ఇదియే కథ చెప్పుటలో వేరైన గుణము." నిజమే, కల్పవృక్షంలో కైకేయినే ఎంచుకొని పాత్రను మలచిన సంవిధానాన్ని పరిశీలనాత్మకంగా

వివరించడం కూడా ఒక విధంగా యితర విమర్శకులకన్న వేరైన గుణమే. ఏమైనా, మంచి సాహితీ విలువ కలదీ వ్యాసం.

రచయిత్రి ప్రతిభ, వ్యుత్పత్తి, పరిశీలనా ప్రకర్షకు అద్దం పట్టేవిగా ఉన్నవి, శ్రీదేవి నవల కాలాతీతవ్యక్తుల(1961)పై వ్రాసిన విమర్శ, "స్త్రీ – నవలావికాసం" (1976) పై చేసిన సమీక్షను. బి. ఏ. చదివి ఉద్యోగం చేస్తున్న ఇందిర, ఆమె చుట్టూగల పాత్రల చిత్రీకరణ, కాలానికి అతీతంగావున్న వ్యక్తుల జీవన చిత్రీకరణ యీ నవల. దీనిలో పాఠకులకు, పరిశీలకులకు చప్పున దృష్టిలో పడేది ఇందిరపైన, జీవితంలో ఆమె పడిన బాధలు యిత్యాదులపైన. కాని, డాక్టరు కృష్ణకుమారి పరిశీలనా దృష్టే వేరు. ఆమెకు కృష్ణమూర్తి పాత్రపై అమితమైన సానుభూతి. లోతుగా ఆలోచిస్తే, ఎవరికైనా అది సబబే అనిపిస్తుంది. అందుకే, కృష్ణమూర్తి పాత్ర గురించి ఎంత తూచి వ్రాశారో చూడండి: "కృష్ణమూర్తి జీవితాన్ని ఎంత చులకనగా తీసుకొని దానితో ఆటలాడినా, అటువంటి ఆటలో తనతోపాటు పాల్గొనవలసింది ఇందిర వంటివారే కాని వసుంధర వంటివారు కాదని గ్రహించగలిగాడు. ఆ గ్రహింపే అతనికి లేక కొంత స్వార్థంతో కృష్ణమూర్తి ప్రవర్తించి యుంటే, వసుంధర జీవితమే తారుమారయ్యేది. జీవితాంతం ఆ అనుభవ శూన్యురాలు బాధపడి ఉండేది. స్వార్థం కోసం ఆ అమ్మాయిని రెచ్చగొట్టడం సులభమే అయినా, అటువంటి నీచానికి పాల్పడకుండా, వసుంధర జీవితం నుండి పారిపోయిన ఉదారుడు కృష్ణమూర్తి." సాధారణంగా నేటి రచయిత్రులలో కనిపించని సానుభూతి డా॥ కృష్ణకుమారిలో ఉన్నట్టు తోస్తుంది.

డా. కృష్ణకుమారి తన భావాలను కుండబద్దలు కొట్టినట్టు నిక్కచ్చిగా చెప్పగలరు. ఎటువంటి మొగమాటాలకు తావివ్వరు. తెలుగు నవలా వికాసం, మహిళా రచయితల గురించిన ఆమె అవగాహన, పరిశీలన, ఆ తర్వాత వెలిబుచ్చిన అభిప్రాయాల్ని నేడు పుంఖాను పుంఖంగా నవలలను ఉత్పత్తి చేస్తున్న రచయిత్రులు గమనించాలి. ఈక్రింది వాక్యాలు చదివితే, స్త్రీలు రచనాయుధాన్ని చేతపట్టి కుప్పలు కుప్పలుగా ఎంత చచ్చు నవలల్ని సమాజంమీదికి, సాహితీ రంగంలోకివిసిరేస్తున్నారో, వాటి ప్రభావ శూన్యతపై శ్రీమతి కృష్ణకుమారి వంటి మేధావి వర్గం ఎలా బాధపడుతున్నారో, ఒక మహిళగా, రచయిత్రిగా, పరిశీలకురాలిగా, విమర్శకురాలిగా ఆమెకుగల అభిప్రాయాలు, వాటి వాడి తీక్షణత ఆమె ఆవేదనకెలా అద్దం పడుతున్నవో తెలుస్తుంది: "స్త్రీ పురుషుల మధ్య సంఘం అనాదిగా కల్పించిన అసమానతలను గురించి, వాటి ప్రభావాన్ని తక్కువగా అంచనావేయని పరిశీలకులు రచనా రంగంలో కూడా వీళ్ళమధ్య అసమానతలున్నవనే ఒప్పుకొని తీరవలసి వస్తుంది. రచనా సమూహంలో ఆడ రచయితల రచనల్ని తేలికగా గురుపట్టగల ముద్ర మనకళ్ళ యెదుట తాండవిస్తూనే ఉంటుంది .... "మరోచోట నేటి

నవల గురించి యిలా అన్నారు: "నవలలు జీవితంయొక్క సత్య కథనాలుగా, సమగ్ర చిత్రాలుగా కనిపించవు. నవల అంటే కేవలం ఊహకు లొంగిన కాల్పనికమైన గద్య రచన అని కాబోలు వీరి భావన."

ఇతివృత్తాలు, స్త్రీలు – స్త్రీల సమస్యలపై వ్రాస్తున్న తీరుల గురించి తీవ్రమైన విమర్శే చేశారు. తెలుగు నవల ఎదగక పోవడానికి కేవలం యీ విధమైన మహిళా రచయితల విజృంభణే కాదు. అందుకు దోహదంచేసేవిపత్రికలు సినిమాలు కూడా అని వీరి ఆరోపణ. ఈ విమర్శ ఏదైనా సానుభూతితోను, ఆవేదనతోను చేశారే తప్ప ఈర్ష్యవల్ల మాత్రం కాదనడానికి యీ క్రింది వాక్యాలు పరిశీలిస్తే చాలు ద్యోతక మవుతుంది: "తెలుగు రచయిత్రి తన రచన ద్వారా ఎదగాలి. సంఘానికి అవసరమైన చైతన్యాన్ని అందించే వాహికగా తన కలాన్ని మార్చుకోవాలి.... ఇంత గురుతర భారాన్ని సక్రమంగా నిర్వహించినప్పుడే మన రచయిత్రులు నవలా ప్రక్రియను ఏలుతున్నారన్న సంతోషం మిగులుతుంది."

ఇలాంటి ఘాటైన పరిశీలనాత్మక వ్యాసాలతోపాటు, సంక్రాంతి, పల్లె ప్రజలు – పండుగలు, పదవాఙ్మయంలో పిల్లల ప్రసక్తి, పంచకన్యలు, పంతులుగారి సాహిత్య పరిణామంవంటి గణనీయమైన వ్యాసాలూ, స్త్రీల 20 వ శతాబ్దపు తెలుగు కవిత్వాన్ని గూర్చిన ఒక పరిశీలన వ్యాసం కూడా యీ సంకలనంలో ఉన్నాయి. స్త్రీలు యితర సాహిత్య ప్రక్రియల్లో ముందంజవేసినట్టు కవితలు వ్రాయడంలో వేయడంలేదని అంటూ, ఆ భావాన్ని చురక వేసినట్టు చెప్పారు రచయిత్రి "ఈనాడు దేశంలో రచనా వ్యాసంగం చేస్తున్న స్త్రీ లందరూ తక్కువ మాటలతో ఎక్కువ భావాన్ని హృదయ స్పర్శిగా చెప్పే యీ ప్రక్రియను (కవిత వ్రాయడం) చేపట్టాలని నేను మనసారా కోరుకుంటున్నాను." ఈ కోరుకోవడంలో ఒక విధమైన సవాలు కూడా ఉంది. రచయిత్రులు ఇది గ్రహించాలి.

మొత్తానికి, "పరిశీలన" వ్యాస సంకలనం పేరుకు తగిన, చదవదగిన ఉత్తమ గ్రంథం సాహితీ పిపాసులు, విమర్శకలు మరీమరీ చదవవలసినట్టుంది.

ప్రాప్తి స్థానం : నాయని కృష్ణకుమారి 8–3–898/2, నాగార్జునసాగర్, హైదరాబాద్ 500 878

— డా. ఇందుర్తి ప్రభాకరరావు

జనసాహితితో మా విభేదాలు

రచన: రంగనాయకమ్మ. వెల : రు: 4-50
స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
హైదరాబాద్

ప్రతులకు : అరుణా పబ్లిషింగ్ హౌస్, ఏలూరురోడ్, విజయవాడ
520002

సాహిత్యరంగంలో అనేక సంస్థలున్నాయి. రాష్ట్రవ్యాపితంగా రచయితల కార్యకలాపాలను సమన్వయపరుస్తూ నిర్దిష్టమైన ప్రణాళిక ఆధారంగా పనిచేస్తు

న్నవి అభ్యుదయ రచయితల సంఘం లాంటివి ఒకటో రెండో ఉన్నాయి. ఇక సాహితీ సాంస్కృతిక కార్యాకలాపాలకు రెంటికీ ప్రాతినిధ్యం వహిస్తున్నామనకొనేది జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య. ఇందులోనుంచి ఒంగనాయకమ్మ మరికొందరూ బయటకెళ్ళారు తామెందుకు జనసాహితినుండి బయట కెళ్ళాల్సి వచ్చిందో తమ వాదనలను వివరిస్తూ తెచ్చిన పుస్తకం ఇది తమ వాదనలను సమర్థించే అనేకానేక విషయాలను సంస్థాపరమైనవీ - వ్యక్తిగతమైనవీ ఇందులో రచయిత్రి పొందుపర్చింది.

రాయప్రోలు వాఙ్మయ జీవిత సూచిక

రచన : కాత్యాయినీ విద్మహే, లెక్చరర్
ఆర్ట్సు అండ్ సైన్సు కాలేజి
వరంగల్
వెల : రు 2-00

తెలుగులో ఈనాడు అనేకమంది పరిశోధన సాగిస్తున్నారు. విశ్వవిద్యాలయాలన్నీ ఈ దశలో విద్యార్థులను వివిధ రూపాల్లో ప్రోత్సాహపరుస్తున్నాయి.

సాధారణంగా సాహితీవేత్తల జీవితాలమీదా వారి రచనా వ్యాపారంమీదా పరిశోధన చేయటం కష్టసాధ్యమైన పని. కారణం, సాహితీవేత్తలు తమ జీవిత ఘటనలను గూర్చి ఆదినుండీ అంతగా పట్టించుకోకపోవటం. తరువాత తమ రచనలనూ అవిపడ్డ పత్రికలనూ - సంపుటాలుగా వచ్చినవాటినీ సేకరించి భద్రపర్చి ఉంచుకోవటంలాంటి వాటిమీద శ్రద్ధ లేకపోవటంలాటివెన్నో ఉన్నాయి. ఎవరన్నా పరిశోధన చేయాలనుకున్నప్పుడుకానీ ఈ సాధక బాధకాలు తెలియవు. అలా సేకరించిన విషయాలన్నీ క్లుప్తంగా క్రమంగా నమోదుచేసి అచ్చేయటం భావి పరిశోధకులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

కాత్యాయనిగారు ఆచార్య రాయప్రోలు జీవితం - రచనలమీద అలా సేకరించిన విషయాలన్నీ ఈ చిన్న పుస్తకంలో భద్రపర్చారు. విషయాలకు స్వల్పంగా వివరణలనుకూడా అక్కడక్కడ పొందుపర్చారు.

సూత్రబద్ధమైన పరిశోధన సాగించే వాళ్ళందరూ అనుసరించదగ్గ మార్గం ఇది. రచయిత్రి కృషి ప్రశంసనీయం.

ఆలూరి బైరాగి సంస్మరణ సంచిక

వెల : రు 10/-
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
ఏలూరురోడ్డు
విజయవాడ-4
1979

"ఉదయిస్తాడనల సంభవుడాత్మధవుడు నవ మానవుడు !" (ఆగమగీతి)

అన్న ఆశాభావం కల కవి బైరాగి రాడికల్ భావాలతో ప్రభావితుడై

బైరాగి ఆదిలో అభ్యుదయ రచయితల ఉద్యమాన్ని శీతకంటితో చూశాడు. అతని భావాల పరంపర కవిత్వం ఉడుపులు ధరించి నూతిలో గొంతుకలు, 'చీకటి నీడలు' కవితా సంకలనాలుగా రూపుదిద్దుకున్నాయి. బైరాగి కవితను పైపైన చదివిన వాళ్ళకు అతనిలో 'నిరాశావాదం' 'పలాయనవాదం'- లాంటివి కనిపిస్తాయి; 'తాజ్‌మహల్ పడగొట్టండోయ్-రాయి రాయి విడగొట్టండోయ్' అన్నవిచూస్తే ఇతనిలో సౌందర్యాన్ని నాశనంచేయాలన్న గుణం గుండెలోతుల్లో ఉందా అన్న భ్రమ పఠితలకు కలుగుతూంది.

కాని, బైరాగి జీవితం - రచనలూ, నాటి సామాజిక పరిస్థితులను జాగ్రత్తగా అధ్యయనం చేయందే,ఈయన కవితాత్మ సైద్ధాంతికంగా అంచనా కట్టలేం.

ఆ దిశలో, తెలుగునాట కొందరు - బైరాగి పరిచితులు చేసిన ప్రయత్నం ఈ సంచికలో చూడొచ్చు. బైరాగి కవితలూ ఉన్నాయి.

నిజంగా బైరాగికి ఆయన జీవించిన కాలంలో రావలసినంత గుర్తింపు రాలేదనొచ్చు. ఆయన చనిపోయాడు. కనక ఇక రావటం ఆరంభమైందనీ అనచ్చు.

ఈ సంచికలో కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, దాశరధి, విద్వాన్‌విశ్వం, ఆరుద్ర, కుందుర్తి, సోమసుందర్‌లాటి కవులూ; సెట్టి ఈశ్వరరావ్, నార్ల, రాంభట్ల, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, ఆవుల సాంబశివరావ్, కె. వి. రమణారెడ్డి, రారా, కొకు, ఏల్చూరి, పద్మరాజు, ఎ. యస్. రామన్ తదితరులూ రాసిన వ్యాసాలున్నాయి. బైరాగినీ - అతని కవితనీ విభిన్న కోణాల్లో చూసి గీసిన కలం చిత్రాలెన్నో ఉన్నాయి. అనేక విశేషాలు చెప్పారందరూ.

చాలా శ్రమించి ఆకర్షణీయంగా తెచ్చిన సంస్మరణ సంచికల్లో దీన్ని ఉత్తమం అనచ్చు. సాహితీపరులు తప్పక భద్రపరచాల్సిన సంచిక ఇది.

—బికె

కొమ్మమీది కోయిలనై ....

—వెంపలి వెంకట శివప్రసాద్

లోకంలోని శోకాన్నంతటినీ తాగేసి
ధబ్బున కూలిపోతాను
భగ్గున మండిపోతాను
అసలే నివురైపోతాను
అప్పుడు-
వెయ్యి సౌఖ్యాల వెలుగులు కళ్ళలో
నింపుకొని
ఆనందగంగా ప్రవాహంలో
మునిగి తేలుతున్న జనాన్ని
అసమానత లసలే లేనిలోకాన్ని
భూతల స్వర్గాన్ని
పాటలుగా కూర్చి పాడడానికి
కొమ్మమీది కోయిలనై పుడతాను.

నేటికీ కోటి కిరణాలద్యుతులు ప్రేమ్‌చంద్ కృతులు

ప్రేమ్‌చంద్ రచనలు నేటి పరిస్థితులకు సరిపడవనీ, వాటికి కాలదోషం పట్టిందనీ అక్కడక్కడ అప్పుడప్పుడు కొందరంటూ ఉంటారు. ఆయన దృష్టి ఆధునికమైందికాదు; ఆయన రచనా విధానం సామాన్యమైనది; ఆయన రచనల్లో మానవస్వభావపు గూఢత్వం కనిపించదు — యివీ, వారి అభిప్రాయాల్లో కొన్ని. నిజమే, ఆయన సంఘ సంస్కర్త, సంఘ విమర్శకుడు, సంఘ వ్యాఖ్యాత; కాని ఆయన పరిశీలనా పద్ధతి ఆధునికమైంది కాదు— యిదీ వారి ధోరణి.

ప్రేమ్‌చంద్‌పై యిట్టి విమర్శలు కొత్తవేమీకావు. గత నాలుగు దశాబ్దాలుగా ఎవరో ఒకరు ఎక్కడో ఒకచోట యిలాంటి అభిప్రాయాలు వెలిబుచ్చుతూనే, ఉన్నారు. నిజానికి, ప్రేమ్‌చంద్ తన జీవిత కాలంలోనే యిట్టి విమర్శల్ని ఎదుర్కోవలసివచ్చేది. వారి అసలు వాదన ఒకటే: సాహిత్యం ఒక కళ; ప్రచారంకాదు.

ఈ సమస్యమీద ప్రేమ్‌చంద్ తన అభిప్రాయాన్ని నిష్కర్షగా చెప్పేవారు; ఒక్క అంగుళమైనా క్రిందికి దిగేవారుకారు. ఒక వ్యాసంలో ఆయనిలా రాశారు;

సాహిత్యంలో సౌందర్యాంశ

"ఒక రచయితలో సంవేదన (Feeling) ఎంత నిశితంగా ఉంటే. అంత సుందరంగా అతని రచన ఉంటుంది; అంత ఉన్నత స్థాయినది అందుకొంటుంది. మన హృదయాల్ని స్పందింపజేయని రచన, మన ఆత్మల్ని సంతృప్తి పరచని రచన, మన మనస్సుల్ని ఉత్సాహపరచనిరచన, మనలో సౌందర్య పిపాసను రేకెత్తించని రచన యీనాడు నిరుపయోగం. దాన్ని మనం సాహిత్యమని పిలవలేం

"సౌందర్య పిపాస లేని మానవుడంటూ ఉండడు. దాన్ని రేకెత్తించడమే, ప్రేరేపించడమే మనం చేయవలసింది. రచయితలో యిదెంత ఉచ్చస్థాయిలో ఉంటే, అంత శక్తివంతంగా ఉంటుంది అతని రచన. ప్రకృతిని నిశితంగా పరిశీలించడం ద్వారా, తన సంవేదనల్ని పదును పెట్టుకోవడం ద్వారా అతడే సుందరతను పెంచుకుంటాడు. అప్పుడతడు వైకల్యాన్నీ, కశ్మలాన్నీ, మానవత లోపించేదాన్నీ, సహించలేడు. దాన్ని తన యావచ్ఛక్తితో, తన మాటల బలంతో, తన భావావేశంతో

అమృత్ రాయ్

ఎదుర్కొంటాడు. ఒక విధంగా, అతణ్ని ఒక నిబద్ధునిగా పేర్కొనవచ్చు. అతడు మానవ జీవితపు ఉదాత్త విలువలకై పోరుసల్పుతాడు. పీడితులందరి, బాధితులందరి, క్షోభితులందరి క్షేమంకోరతాడు. పోరాడుతాడు. సమాజం అన్యాయస్థానంలో అతడు వారి తరపున వాదిస్తాడు.

"దీన్ని బట్టి, ఫలానా రచయిత రైతుల తరపున, లేదా కార్మికుల తరపున, లేదా రైతు-కార్మికుల ఉద్యమం తరపున ప్రచారం చేస్తున్నాడని ఎవరైనా అంటే, అది అన్యాయమే. ఈ సందర్భంలో మనం సాహిత్యానికీ ప్రచారానికీ గల భేదాన్ని తెలుసుకోవడం ఎంతైనా అవసరం... ప్రచారం అనేది చదివి ఆనందించేది కాదు. ఎందుచేతంటే అందులో నిజమైన సంవేదన (feeling) ఉండదు. దాన్నే ఒక తెలివైన కళాకారుడు సౌందర్యంతో, సంవేదనతో రూపొందిస్తే, అది ప్రచారం అవదు; మంచి సాహిత్యం అవుతుంది.... గొప్ప రచయితల గ్రంథాల్లో సాహిత్యం ప్రచారం కలిసిపోయి ఉంటాయి. ఏదైనా ఒక విషయాన్ని ఉన్నది ఉన్నట్లు, మామూలుగా చెబితే, అది ప్రచారమవుతుంది. దాన్నే సుందరంగా, మనోరంజకంగా చెబితే, అది నిజమైన సాహిత్యమవుతుంది. అందుచేత, మనం, ఒక కళాకారుణ్ని ఫలానా విషయాన్నే ఎందుకు తీసుకున్నాడని అడగలేం. అది అతని ఆసక్తిని బట్టి, అభీష్టాన్ని బట్టి ఉంటుంది. మనకు మాత్రం గీటురాయి ఒకటే; అది మనల్ని సత్యానికి మరింత దగ్గరకు, సుందరతకు మరింత సమీపానికి తీసుకెళ్తోందా -అనేది."

విమర్శకుల దృక్పథం

ప్రేమ్‌చంద్ తన అభిప్రాయాల్ని నిర్భయంగా ప్రకటించడంతోపాటు, వాటిని తన రచనల్లో నిష్కర్షగా రూపుదిద్దేవారు. ఇది ఆయన విమర్శకులకు కంటగింపు అయింది. ఏ కారణంవల్లనైతేనేమి, సాహిత్యంపట్ల వారు ఉన్నత వర్గాల దృక్పథ మవలంబించేవారు. దాన్ని సామాన్య ప్రజలకు సన్నిహిత మొనర్చడ మంటే యిష్టపడేవారు కాదు. ఇది, ఆయన జీవించి యున్నప్పటి మాట. నేడు యిది మరింత ప్రస్ఫుటంగా ద్యోతక మవుతోంది. సాహిత్యం వ్యక్తి ఔన్నత్యంకొరకు ఉద్దేశింపబడిందనీ, ప్రజాజీవితంతో దానికి సంబంధం లేదనీ భావించే మేధావులకు ప్రేమ్‌చంద్ రచనలు రుచించడంలేదు. వారు వ్యక్తివాదులు; ఉన్నతవర్గ దృక్పథ మలవరచుకున్నవారు; కొద్దిమంది ఉన్నత భావుకుల్ని ఆనందపరచే ప్రక్రియగా వారు దాన్ని పరిగణిస్తారు. వీరి దృష్టిలో సామాన్య ప్రజలు పనికిరానివారు, అల్పజ్ఞులు, నీచులు. తమ ప్రపంచంలో వారిని అడుగుపెట్టనీయడమా? తమతో కలిసి వారెలా జీవించగలరు? తమ ఆనందాన్నెలా పంచుకోగలరు? దూరంగా ఉండడమే తమకు కావలసింది. ఇదీ వారి దృక్పథం.

ప్రేమ్‌చంద్‌కి యిట్టి సంకుచిత దృష్టి లేనే లేదు. సామాన్య ప్రజల్లో ఆయనొకరు. వారికోసం ఆయన రచనలు చేశారు; వారికన్న తాను ఎక్కువనే

అహంభావం ఆయనకు లేదు. తన రచనల్లోని మాధుర్యం వారికి రుచించదన్న అనుమానమూ ఆయనకు లేదు. వారు తన భావాలను అర్థం చేసుకోవడమేకాక, మెచ్చుకుంటారన్న విశ్వాసం ఆయనకుంది ఆ విశ్వాసమే ఆయన రచనల్ని మరింతగా పదును పెట్టింది; మరింతగా శక్తివంత మొనర్చింది; మరింతగా ప్రజానురంజక మొనర్చింది. ఇది ఆయన విమర్శకుల్ని క్రోధోన్మత్తుల నొనర్చింది. కాని, సామాన్య పాఠకుల్లో ఆయన రచనలపట్ల అభిమానం పెరిగింది.

ఒక ముఖ్య విషయం

ఇక్కడ మనమొక ముఖ్య విషయం గుర్తుంచుకోవాలి. అదేమంటే, గత అర్థ శతాబ్దికాలంలో ప్రేమ్‌చంద్‌పట్ల సామాన్య పాఠకుల అభిమానం తగ్గలేదు సరికదా, ఎంతో హెచ్చింది. సామాన్య పాఠకులంటే, అశ్లీల సాహిత్యం, అపరాధ సాహిత్యం, రకరకాలైన చౌకబారు సాహిత్యం చదివేవారుకారు; విజ్ఞానం, వికాసం, ఉత్తేజం కలిగించే సాహిత్యం చదివేవారని అర్థం. అట్టి పాఠకుల దృష్టిలో ప్రేమ్‌చంద్ నేడొక మహాకాయునిలా దర్శన మిస్తున్నారు. హిందీ రచయితల్లో ఏటా ఎవరి రచనలు పబ్లిక్ లైబ్రరీలలో ఎక్కువగా చోటుచేసుకొంటున్నాయో లెక్కలు తీస్తే, ప్రేమ్‌చంద్ రచనలే ఎక్కువ ఉంటాయని చెప్పవచ్చు. (గోదాన్, కఫన్ మొదలైన నవలలు వెండితెరకు కూడా ఎక్కాయి — అను) దీనికి కారణం ఏమిటి? నలుగురూ ఆయన గ్రంథాల్ని సాంప్రదాయ పద్ధతిలో ప్రమాణ గ్రంథాలుగా పరిగణిస్తూండడంవల్లా? ప్రమాణ గ్రంథాలు రకరకాలైనవి ఉన్నాయి. నిర్జీవమైనవి కూడా ఉన్నాయి. వాటిని మనం గౌరవిస్తాం; కొనియాడుతాం; కాని చదవం. సజీవమైన వాటినే చదువుతాం. ప్రేమ్‌చంద్ రచనలు అలాంటి తరగతికి చెందినవని నా ఉద్దేశం. ఆయన రచనల్ని యిదివరకెంత ఆసక్తితో చదివేవారో, యిప్పుడు కూడ అంత ఆసక్తితోనూ చదువుతున్నారు. ఎందుచేతంటే, యిదివర కాయనెంత సజీవుడో, యిప్పుడూ అంతే గనక. ఆయన కాలంనాటి భారతదేశమే ప్రధానంగా నేటి భారతదేశం కూడా గనక.

కొన్ని ప్రఖ్యాత రచనలు

ప్రేమ్‌చంద్ "కఫన్" (శవంమీది బట్ట), "పుస్‌కీ రాత్" (శరత్ రాత్రి) అనే కథల్లో లక్షలాది రైతుల దారిద్ర్యాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. "ప్రేమాశ్రమ్," "గోదాన్" వంటి నవలల్లోనూ, డజనకొద్దీ కథల్లోనూ రైతులపై భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తులు, గ్రామాధికార్లు సాగించే దౌర్జన్యాన్ని వర్ణించారు. కొద్ది రూప భేదాల్లో అవన్నీ యిప్పటికీ అలాగే వున్నాయి. "బలిదాన్" అనే కథలో, కఠోరమైన దారిద్ర్యం వల్ల పేదరైతులు గ్రామాల్ని విడిచి పట్టణాలకెలా వెళ్ళేవారో, అక్కడ కూలీలుగా తమ శ్రమను అమ్ముకొని ఎంత బాధాకరమైన బ్రతుకు బ్రతికేవారో వర్ణించారు. ఆ పరిస్థితులిప్పటికీ కొద్ది తేడాలతో మనం చూస్తూనే ఉన్నాం. "రంగభూమి" నవలలో ఒక భూస్వామి రైతును బేదఖలొనర్చి ఆ

స్థలంలో ఫ్యాక్టరీని నిర్మించడాన్ని సూర్‌దాసు ఎంత గట్టిగా ప్రతిఘటించాడో మనం చూస్తాం. ఈ విధమైన పెట్టుబడిదారీ సంబంధాల విస్తరణ నేటి సమాజాన్నెంత అస్తవ్యస్తమొనర్చుతుందో మన కళ్ళయెదుట కనిపిస్తూనే ఉంది.

గ్రామీణ ప్రజల మనస్సులపై మూఢాచారాల ప్రభావమెంత బలంగా ఉందో తెలియజేస్తాయి, "ప్రతిజ్ఞ", "నిర్మల", "వరదాన్" అనే రచనలు. కూటికి మొగం వాచి పడుపు వృత్తికి దిగే సుమన్‌లాంటి పిల్లలు "సేవాసదన్" లాంటి నవలల్లోనే కాక, నిత్య జీవితంలో మనకు తారసిల్లుతున్నారు. "కాయకల్ప" లో రాజకీయాధికారం కొరకు స్వార్థపరులు చేసే కుట్రలు, దుష్కార్యాలు చిత్రింపబడ్డాయి. ఉద్యోగుల్లో లంచగొండితనం "నమక్–కా దరోగా" (సాల్ట్ ఇన్‌స్పెక్టరు) రచించినప్పుడెంత ప్రబలంగా ఉండేదో, అంతకన్నా ప్రబలంగా యీనాడుంది. "అస్రర్–ఇ–మాబిద్" (దేవాలయ రహస్యాలు) అనే నవలలో ప్రేమ్‌చంద్ మహంతుల వ్యసనాల్నీ, దౌష్ట్యాల్నీ ఎత్తి చూపారు.

ఈ విధంగా, ఎన్ని రచనల్నైనా పేర్కొనవచ్చు. ఎందుచేతంటే, ప్రేమ్‌చంద్ సమాజ శ్రేయస్సును కోరి రచనలు చేసినవాడు. సామాజిక ప్రగతికి ఆయన నిబద్ధుడు. మానవ కల్యాణం ఆయన ఆశయం మానవ స్వేచ్ఛ ఆయన అభిలాష. ప్రస్తుత కాలానికి ఆయన రచనలు పనికి రావనడం వట్టి మూర్ఖం. ప్రజలతో ఆయనకు సజీవ సంబంధాలుండేవి. అవి బలీయమైనట్టివి. అందుచేతనే ఆయన రచనలు యిప్పటికీ మనల్ని ఉత్తేజపరుస్తాయి.

వామపక్షీయత

1905–07 నాటి వందేమాతరం ఉద్యమం ప్రేమ్‌చంద్‌ని ఉత్సాహపరచింది. ఆయన లాల్, బాల్, పాల్‌ల (లాలా లజపతిరాయ్, బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్) అభిమాని. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఎవరేమిచేసినా దాన్ని ఆయన బలపరచేవారు. ఖుదీరాంబోసు అను బెంగాలీ యువకుడు ప్రజల ద్వేషాగ్నికి గురిఅయిన ఒక బ్రిటిష్ ఉన్నతోద్యోగిమీద బాంబు విసిరినందుకు ఉరితీయబడ్డాడు. అతనిపట్ల అభిమాన సూచకంగా, ప్రేమ్‌చంద్, తన ఉద్యోగానికి ప్రమాదం వాటిల్లగలదన్న సంకోచం లేకుండా, అతని చిత్రపటాన్ని తన గదిలో గోడకు తగిలించుకున్నారు. తర్వాత, అమరవీరుల జీవిత గాధల్ని ఒక పుస్తకంగా ప్రకటించారు. దాన్ని వెన్వెంటనే ప్రభుత్వం నిషేధించింది. దాని ప్రతుల్ని బహిరంగంగా తగులపెట్టించింది. భారతీయ విప్లవకారులకు మార్గదర్శకులయిన ఇటాలియన్ విప్లవకారుల (గారిబాల్డీ, మాజినీ) జీవితాలను పుస్తక రూపంలో ప్రచురించారు. 1908 ప్రాంతంలో హిందూమత సంస్కరణకై కృషి చేస్తున్న ఆర్య సమాజాన్ని బలపరచినప్పటికీ, అది నడిపిన శుద్ధి ఉద్యమాన్ని (ముస్లిం మతాన్ని స్వీకరించిన హిందువుల్ని తిరిగి మతంలో చేర్చుకోడం) తీవ్రంగా వ్యతిరేకించారు. "ఖహాతుర్రి జావ్" అనే కరపత్రం (నిజాయితీపరుల కొరత) లో దాన్ని పదునైన భాషలో

ఖండించారు. గాంధీజీ నాయకత్వాన్ని ఆయన అంగీకరించినమాట నిజమే. కాని, గాంధీ సిద్ధాంతాలన్నిటినీ ఆయన ఆమోదించలేదు. స్వరాజ్యమంటే రామరాజ్యమన్న నిర్వచనాన్ని 1921 లోనే ఆయన వ్యతిరేకించారు. ప్రజలకు సంపూర్ణ పరిపాలనాధికారం ఉన్నప్పుడే స్వరాజ్యం అని ఒక వ్యాసంలో స్పష్టీకరించారు. మరుసటి సంవత్సరం, "సంగ్రామ" అనే నవలలో, ఆధునికుల్ని సైతం ఆశ్చర్యపరచే విధంగా, దాని కథానాయకుణ్ని మ్యాజిక్ లాంటెర్న్ స్లయిడ్ల సహాయంతో, నిజమైన స్వరాజ్య దృశ్యాన్ని చూపిస్తున్నట్లుగా చిత్రించారు.

సామ్యవాద తరంగిణికి స్వాగతం

అంతకుముందే, 1919 ఫిబ్రవరిలో, "పూర్వయుగం, ఆధునిక యుగం" అనే వ్యాసంలో ప్రేమ్‌చంద్ యిలా వ్రాశారు: "పాత యుగం పోయి, కొత్తయుగం వస్తూంది. ఇది కార్మికుల యుగం, కర్షకుల యుగం. ప్రపంచ ఘటనలు దీన్నే సూచిస్తున్నాయి. దీని గాలులు భారతదేశానికి కూడా సోకక మానవు. హిమాలయ పర్వత శిఖరాలు సైతం వాటిని అడ్డుకోలేవు. నేడు కాకపోతే రేపైనా, ప్రజానీకం గొంతెత్తి అరవగల్గుతుంది. అరవడమేకాదు, బలీయంగా తన హక్కుల్ని డిమాండ్ చేస్తుంది. అప్పుడు, వారే మీ భవిష్యత్తును నిర్ణయిస్తారు. మీరు చేసిన అన్యాయాలు మీకు అప్పుడు గుర్తుకు వస్తాయి. నిస్సహాయంగా మీరు లబోదిబో అని అరుస్తారు. పైకి ప్రశాంతంగా కనిపిస్తున్న దానిని చూచి మోసపోకండి. రష్యా ప్రజల్లో అంత శక్తి దాగియుందని విప్లవానికి ముందు ఎవరెరుగుదురు?"

ప్రేమ్‌చంద్ రష్యా విప్లవానికి అంత త్వరగా, 14 నెలల తరవాత, స్వాగతం పలకడం ఎంత ఆశ్చర్యం! ఆ విప్లవాన్ని వక్రీకరించడానికే తప్ప వాస్తవాన్ని చెప్పేందుకు ఏ పెట్టుబడిదారీ పత్రిక పూనుకొనని రోజుల్లో యిది మరింత ఆశ్చర్యం కాదా ?

ప్రేమ్‌చంద్ 1918 మే 2 వ తేదీని "ప్రేమాశ్రమ్" అనే నవల ప్రారంభించి, 1920 జనవరి 25 న ముగించారు. అది 425 పేజీల గ్రంథం. అందులో, ఒక రైతు తన స్నేహితులతో అన్న మాటలు యివి: "మీరు నన్ను ఎగతాళి చేస్తున్నారు, రైతులెందుకూ పనికిరానివాళ్ళని మీ ఉద్దేశం; భూస్వామికోసం బానిస చాకిరీ చేయడానికే రైతులు పుట్టారని మీ అభిప్రాయం. కాని, రష్యా అనే దేశంలో రైతులే రాజ్యం చేస్తున్నారు; తాము చేయదలుచుకొన్నది చేస్తున్నారు. ఇది నేనొక వార్తా పత్రికలో చదివాను. రష్యా ప్రక్కనే బల్గేరియా దేశం వుంది. అక్కడ రైతులు యీమధ్యనే తమ రాజును సింహాసన భ్రష్టుణ్ణి చేశారు. ఇప్పుడా దేశాన్ని కార్మిక-కర్షక కమ్యూన్ పాలిస్తోంది."

ఇంత అప్రమత్తతతో ప్రపంచ ఘటనల్ని ఆకళింపు చేసుకొన్న ప్రేమ్‌చంద్, 1919 డిసెంబరు 21 న ఒక స్నేహితునికి వ్రాసిన ఉత్తరంలో "నేనిప్పుడు బోల్షివిక్ సిద్ధాంతాలను యించుమించు విశ్వసిస్తున్నాను," అని వ్రాయడంలో ఆశ్చర్యం ఏముంది?

జాతీయోద్యమ గర్భంలో సామ్యవాదాంకురాల్ని

మాలపల్లి నవలా రచన వెనుక ఉద్బోధకంగా వీరేశలింగం పంతులుగారి సంఘ సంస్కరణ, అందుకు సంబంధించిన మహిళా జనోద్ధరణ, హరిజనోద్ధరణ కార్యక్రమాలూ, ఐరిష్ ప్రజల స్వాతంత్ర్య పోరాట పరిచయమూ. భారత జాతీయ విముక్తి పోరాట తీవ్రవాద నాయకత్వ ప్రభావమూ, అక్టోబరు మహా విప్లవ విజయోత్సాహమూ, తెలుగుదేశంలోని రంపపితూరీ, వీటన్నింటితోపాటు గాంధీగారి ప్రవేశం వల్ల జాతీయోద్యమ తాత్విక దృక్పథంలో వచ్చిన కొత్త పరిణామం – ఇవన్నీ వున్నాయి.

జాతీయ కాంగ్రెసు నాయకుల్లో తీవ్రవాదులకు 1919 చివరికల్లా శ్రామిక ప్రజాసంఘాల బలం ముందుముందింకా పెరుగుతుందనీ, శ్రామికులే పాలకులయ్యే

సజీవంగా చూపిన మొట్టమొదటి తెలుగు నవల

రోజులు వస్తాయనీ, శ్రామికజనం నిర్వహించే ప్రత్యక్షచర్య వాళ్ళ చేతుల్లో ఒక బలమైన ఆయుధంగా తయారైందనీ, అదే రష్యాలో శ్రామిక నియంతృత్వాన్ని స్థాపించగలిగిందనీ ఒక గట్టి విశ్వాసమూ, గొప్ప ఉత్సాహమూ ఏర్పడ్డాయి. 1920 నుండి మొదలైన గాంధీగారి నాయకత్వం జాతీయోద్యమంలో శాంతశూరవాదాన్ని ప్రవేశపెట్టి, ఆచరణ కార్యక్రమంగా సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించింది.

రచయిత, సామాజిక స్పృహ

ఇక్కడ ఒకటి గమనించాలి. సామాజిక జీవితంలో కొత్తకొత్త అనుభవాలూ, ఆలోచనలూ ఎంతగా చోటు చేసుకుంటున్నా, అటు తీవ్రవాదుల్లోగానీ, ఇటు శాంతశూరవాదుల్లోగానీ అంతకు పూర్వం నుండీ వస్తున్న కుల, మత తాత్విక, రాజకీయ

డా॥ కె. రామకోటిశాస్త్రి

సంస్కరణ జీవిత దృక్పథంలో ఏలాంటి మార్పు తీసుకురాలేదు. ఆ పరిధిని దాటిన నిర్దిష్టమైన సాంఘిక ఆర్థిక రాజకీయ తాత్త్వికదృక్పధమొకటిజాతీయోద్యమానికి అప్పటి కింకాఏర్పడలేదు.ఈచారిత్రక నేపథ్యంలో సమాజ జీవితం ఎంతగా"ఉన్నవ"మేధస్సు మీద ప్రతిఫలించిందో, అంతగా ఆయన తన అనుభవ చిత్రాలకు వస్తురూపాన్ని నిర్మించ పూనుకోగా. అది మాలపల్లి నవల అయింది. ఆ నవలలో వస్తు నిర్మాణ రూపంలో కనిపించే సామాజిక జీవితమే అందులోని సామాజిక స్పృహ, లేక చైతన్యం రచయితకు ఎంతగా సామాజిక స్పృహ ఉంటే రచనలో అంతగా చైతన్యం క్రియాశీలంగా ఉంటుంది. అందుకు గుర్తేమిటంటే, ఆయా రచనల్లోని ఆయా పాత్రలు తాము పొందిన కష్టనష్టాలవల్ల మన సానుభూతినికాక తాము వాటి నెదుర్కొన్న తీరుతెన్నుల వల్ల మన అగింపును పొందటానికి యోగ్యంగా ఉంటాయి. సామాజిక స్పృహ వున్న రచయిత ఆ మేరకు తన రచనను సామాజిక చైతన్యంతో నింపుతాడు. సాహిత్యం యొక్క అసలు ప్రయోజనం రచయిత యొక్క సామాజిక స్పృహమీద ఆధారపడి ఉండటాన్ని అక్షరాలా ఆచరణలో చూపించిన వీరేశలింగం పంతులూ, గురజాడ అప్పారావుల తరువాత ఆ దృక్పథంతో గట్టి ప్రయత్నం చేసిన తెలుగు రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణగారే.

అభ్యుదయవాదులకు మార్గదర్శకుడు ఉన్నవ

దేశంలోని పై తరగతుల వాళ్ళంతా బ్రిటిషు ప్రభుత్వాన్నుండి దేశాన్ని విముక్తం చెయ్యటమే తమ లక్ష్యంగా భావించి ప్రవర్తిస్తున్న రోజుల్లో, ఆ పరిధికి లోబడి తూనే, స్వతంత్రం తరువాత కూడా కొనసాగవలసిన విముక్తి పోరాటం గురించి ఆలోచించి, ఎవరు ఎవరితో ఎందుకు దాన్ని కొనసాగిస్తారో ముందుగానే భావించి, దానికి వస్తురూప మీయటంవల్ల, తెలుగు నవలా రచయితల్లో ఉన్నవ తన అపూర్వ వస్తు నిర్మాణ ప్రజ్ఞచేత అభ్యుదయవాద భావుకులకు మార్గదర్శకుడై నిలబడ్డాడు. యూరపు నాగరికతలో అభివృద్ధిఅయి, ఇరవయ్యో శతాబ్దం ప్రారంభా నికివలస రాజ్యాలలో ప్రవేశించి, ఆయాదేశభాషల్లో బలపడుతున్ననవలా ప్రక్రియను దాని రొమాంటిక్ లక్షణం నుండి తప్పించి, వాస్తవిక దృష్టితో పీడిత ప్రజల సాంఘిక ఆర్థిక రాజకీయ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల అభ్యున్నతికి ప్రేరకంగానూ, నూతన సోషలిస్టు ప్రపంచ దృక్పథ ప్రదర్శకంగానూ విలక్షణంగా ఒక పెద్ద మలుపు తిప్పిన భారతీయ నవలా రచయితల్లో ప్రేమ్‌చంద్‌నూ, ఆయన ప్రేమా ఆశ్రమం నవలనూ ఉన్నవనూ ఈయన మాలపల్లి నవలనూ పక్కపక్కనే చెప్పాలి. ఇది ఇక్కడా అది అక్కడా ఒకే సంవత్సరంలోకి ప్రజల్లో చొచ్చుకొని వచ్చాయి.

జాతీయ విముక్తి పోరాటం నిజంగా చెయ్యవలసిన వాళ్ళెవరు? వాళ్ళా పోరాటాన్ని ఎక్కడ మొదలు పెట్టాలి? పెడితే ఏమవుతుంది? దాని పరిణామా లెలా

ఉంటాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలే మాలపల్లి నవల నిండా కథా వస్తువు రూపాన ఉన్నాయి.

కథావస్తువులో వర్గ చైతన్యం

భారతీయ సాంఘిక వ్యవస్థలో చిరకాల బహిష్కృతులూ, అధిక సంఖ్యాకులూ, శ్రామికులూ, ప్రధాన ఉత్పత్తి శక్తులూ అయిన మహాజనానికి ప్రాతినిధ్యం వహించటానికి మాలపల్లిలోని రామదాసు కుటుంబాన్నీ, వాళ్ల వెంటనే నిత్య జీవితంలో ఎదుర్కొని పోరాడవలసిన ఉన్నత భూస్వామి వర్గాల ప్రతినిధి చౌదరయ్య కుటుంబాన్నీ ఎదురెదురుగా నిలబెట్టి, అవి రెండూ విరుద్ధ ప్రయోజనాలతో ప్రవర్తించక తప్పని, ఎప్పటికైనా సంఘర్షణకు దిగక తప్పని శత్రువర్గాలన్న వివేకం కలిగించటానికి ఒప నిధానమైన ప్రాతిపదిక మీద రచింపబడ్డ నవల మాలపల్లి.

సంఘ సంస్కరణోద్యమంలో గానీ గాంధీగారి అస్పృశ్యతా నివారణోద్యమంలో గానీ లేని జీవిత అస్తిత్వానికి సంబంధించిన ఆర్థిక పునాదిని ఆధారంచేసి ఉన్నవ పూర్తిగా హరిజనులతోనే సంబంధించినదిగా నవలా వస్తువును నిర్మాణం చేయటంచేత ఆయన దృష్టిలో అప్పటి చారిత్రక పరిస్థితులను మించి సామాజిక చైతన్యం వర్గ స్వభావ చైతన్యంగా ఉండివుండటం కనిపిస్తున్నది. అందువల్లనే రామదాసుతరం, భూస్వామ్య వర్గ చైతన్యం యొక్క ఆధిపత్యం కింద ఉండటంగా నవల ప్రారంభించబడింది. చౌదరయ్యకు రామదాసు ఎదురు తిరగడు. మార్పు రామదాసు కొడుకులూ చౌదరయ్య కొడుకూ పెద్దవాళ్ళవుతున్న కొద్దీ వచ్చింది. అంటే భూస్వామ్య వ్యవస్థ ధనస్వామ్యానికి మొగ్గుతున్న దన్నమాట. అసలు పోరాట మప్పుడు మొదలవుతుంది. ఈ విధంగా నవలా వస్తువు సామాజిక స్పృహనా వర్గ చైతన్యాన్ని ప్రతిబించింది.

విముక్తి పోరాటానికి సిద్ధం కావలసిన వర్గం, దాన్ని ఎదుర్కొని హతమార్చాలని చూచే వర్గం, స్పష్టంగా ఏర్పాటై కనిపిస్తున్నప్పుడు, వర్గకలహ సోషలిస్టు దృక్పధానికి మాలపల్లి నవలకూ సంబంధమే లేదని అనుకోనవసరం లేదు.

విముక్తి పోరాటంలో పాల్గొనవలసినవాళ్ళూ, అందుకు తగిన ఉత్తేజాన్ని పొందవలసినవాళ్ళూ తెలుగు ప్రజలు గనుక, వాళ్ళు అనేక కారణాల చేత చాలా కాలంగా చాలామంది నిరక్షరాస్యులు కనుక, అక్షరాస్యుల వరకయినా ఈ నవల పోవాలంటే వాళ్ళవాళ్ళ వ్యావహారిక భాషా శైలీ, నుడికారం అర్థం చేసుకోవాలనీ, అవలంబించాలనీ గట్టి పట్టుదలతో ప్రయత్నపూర్వకంగా చేయబడ్డ రచన కావటం చేత మాలపల్లి నవలలో వస్తువుతోపాటు రూప రచన విషయంలో కూడా సామాజిక చైతన్య స్పృహ పుష్కలంగా ఉంది.

అభ్యుదయవాద దృక్పథం

వాస్తవిక సమాజ జీవిత స్థితి నుండి రచయిత యొక్క ప్రతిభామతి రూపు దాల్చటం, సామాజిక జీవిత సంఘర్షణల నుండి అనుభూతులూ, ఆలోచనలూ పెరిగి భావ చిత్రాలు గూళ్ళు కట్టటం, ప్రజా ప్రయోజనం దృష్ట్యా కళాత్మకంగా సాహిత్యాన్ని సృష్టించటం – ఇది అభ్యుదయవాద సాహిత్య దృక్పథం. ఆధునిక తెలుగు అభ్యుదయ సాహిత్యంలో ప్రప్రథమంగా చెప్పవలసిన నవల మాలపల్లి.

రాయవెల్లూరు జైల్లో వున్న 12 నెలల్లోని మొదటి తొమ్మిది మాసాల లోపల ఎప్పుడు వ్రాయడం మొదలు పెట్టాడో తెలియదుకానీ – 1922 ఏప్రిల్ 9న ముగించాడు ఉన్నవ ఈ నవలను.

కథా వస్తువు

రామదాసు కొడుకుల్లో సంగదాసు రెండవవాడు. చౌదరయ్య కొడుకు రామానాయుడు. సంగదాసూ రామానాయుడూ ఒక యీడు వాళ్ళు. సంగదాసుకు ఇంగ్లీషు చదువు లేకపోయినా లోకాన్ని చూస్తూ కొంత, రామానాయుడి స్నేహంవల్ల కొంతా కొంత తరకం వివేకం కలిగింది. తన ఇంట్లో జీతగాడే అయినా సంగదాసుతో స్నేహానికీ అతడు తనతో సమానంగానూ సహజంగానూ ప్రవర్తించటానికి రామానాయుడే చొరవ తీసుకొన్నాడు. సంగదాసులోనే కులాచార మర్యాదల పాటింపు యింకా పోకుండా వున్నది. భూస్వామ్య అధికార వర్గచైతన్య ప్రభావం పరిధిలోనే తన కులం జనం అభివృద్ధి కావటం గురించి సంగదాసు ఎక్కువ శ్రద్ధవహించాడు. అంత వరకూ రామదాసుకూ ఇష్టమే. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు రామానాయుడి మద్దతూ సహాయమూ ఉన్నాయి. చౌదరయ్య కదంతా ఇష్టం లేకపోయినా, ప్రత్యక్షంగా తన ఉనికికి భంగం లేదు గనుక చూసీచూడనట్లూరకున్నాడు.

ఇదంతా, భూస్వామ్య సాంఘిక రాజకీయ వ్యవస్థలో రావలసిన మార్పులకు కావలసిన చారిత్రక అవసరాన్ని చూపించటం. క్రమంగా అక్టోబరు విప్లవ ప్రభావం వల్ల భూస్వాముల దోపిడీ విధానం గురించిన వివేకం ప్రజల్లో ఎక్కువ కావటం, భౌతిక పరిస్థితులు కూడా వాళ్ళకు అనుకూలం కావటం 1920 నాటికి ఎక్కువ అవుతున్న వైనాన్ని రచయిత కథావస్తువును రూపుగట్టించటానికి ఉపయోగించుకున్నాడు. భూస్వామి వర్గాల్లో కూడా యువతరానికి ఆధునికమైన విద్యావివేకాల వల్ల తమ ఉనికిని గురించిన ఆలోచన, భావపరివర్తన మొదలు కావటానికి ప్రతిబింబమే రామానాయుడు పాత్ర.

వ్యవసాయ కూలీలకు డబ్బుగా కూలి ఇవ్వాలని చౌదరయ్య, ఎప్పటిలాగానే తిండిగింజలుగా ఇయ్యమని రైతుకూలీల పక్షాన సంగదాసూ నిలబడటమే ఈ నవల లోని సామాజిక జీవితంలోని సంఘర్షణ ఘట్టం. ఆ పునాది మీదనే మిగిలిన నవల అంతా. డబ్బయితేనేం – గింజలైతేనేమని ఇప్పుడనిపించవచ్చును గానీ, నిజంగా అది చాలా తీవ్రమైన సమస్య. భూస్వామ్య వ్యవస్థలో శ్రమకు వస్తుమార్పిడి

ఉంటుంది. అందులోనే దోపిడి ఉంది. శ్రమకు తగిన ప్రతిఫలంగా ఉండదది. వస్తువుకు బదులు డబ్బు ప్రవేశించిందంటే, ఆమాత్రం వస్తువును కూడా శ్రామికులకు అది రానీయదు. భూస్వామ్య వ్యవస్థలో వున్న కాస్త మంచితనాన్ని ధనస్వామ్యం ఆ విధంగా అపహరిస్తుంది. ఈ నష్టాన్ని అనుభవంతో తెలుసుకొన్న రైతుకూలీలు భూస్వాముల దగాకోరుతనాన్ని గ్రహించారు. దాని ఫలితంగానే 1921లో మొదటి సారిగా ఉత్తర భారతదేశంలో ఫిజాబాద్, రాయబరేలీ జిల్లాల్లో రైతు కూలీలు భూస్వాముల మీద తీవ్రమైన తిరుగుబాటు చేశారు.

కొత్తరకం నాయకుడు సంగదాసు

చారిత్రక రాజకీయ సాంఘిక నేపథ్యంలో నవలలో ఉన్నవచిత్రించిన ఘట్టాన్ని పరిశీలిస్తే ఆయన తన నవలను సామాజిక చైతన్యం పునాది మీదనే నిర్మాణం చేయ టానికి పూనుకొన్నాడని తెలుస్తుంది. ఎదురుతిరిగి సమ్మె కట్టించిన నాయకుడు నవల్లో సంగదాసు. ఉత్తరభారతంలో తిరుగుబాట్లకు నాయకత్వం వహించిన వాళ్లు కూడా సంఘం నుండి వెలివేయబడి శ్రమ శక్తులను మోసాలకు అమ్ముకొంటూ తప్పనిసరి పరిస్థితుల్లో బ్రతుకుతూ వస్తున్నవాళ్లే వాళ్ళను భూస్వాములూ, బ్రిటిషు ప్రభుత్వమూ కలిసి-కట్టుగా ఎదుర్కొని అణచివేశారు. అలాగే నవల్లో కూడా సంగదాసును భూస్వామి చౌదరయ్య తల పగలగొట్టి చంపాడు. అతడు హత్యానేరం చేసినవాడు కాకుండా బ్రిటిషు ప్రభుత్వం లంచం తిని చట్టరీత్యా అతన్ని కాపాడింది. ప్రభుత్వం ఎవరికి మద్దతుగా నిలబడుతుందో వర్గసమాజ చైతన్య వివేకంతోనే ఉన్నవ స్పష్టంగా నిరూపించాడు. ఆత్మవిశ్వాసంతోనూ, మానవత మీది ప్రేమానురాగాలతోనూ, కష్ట నష్టాల అనుభవం నుండి జీవిత పోరాటానికి శక్తిని సంపాదించుకొంటున్న కొత్త రకం నాయకుణ్ణి ఆ విధంగా సాహిత్యంలోకి ప్రవేశపెట్టాడు ఉన్నవ.

సంగదాసును చంపి కేసు గూడా లేకుండా చేయించుకోగలిగిన చౌదరయ్య అధర్మ విజయ గర్వంతో రామదాసునూ అతని కుటుంబాన్నీ ఎలా వీధిపాలు చేశాడో ప్రభుత్వం అందుకేవిధంగా తోడ్పడిందో ఉన్నవ మాలపల్లి నవలలో స్పష్టమైన రేఖాచిత్రాన్ని గీచాడు.

ఇంతవరకూ నవల్లో అసలు విముక్తి పోరాటం చెయ్యవలసిన వాళ్ళెవరో తెలిసింది. వాళ్ళెందుకు ఎక్కడ మొదలుపెట్టవలసి వస్తుందో తెలిసింది. మొదలు పెడితే ఏమవుతుందో కూడా తెలిసింది. ఇదంతా ఒక వ్యవస్థా పద్ధతి చట్రంలో నడిచింది. చట్రంలో నడిచినంతసేపూ విముక్తి పోరాటానికి తల బొప్పులు కట్టటం తప్పితే కలిగిన ప్రయోజనమేమీ లేదు. ప్రయోజనమేమీ లేదన్న నిశ్చయజ్ఞానం అనుభవంలో తెలిసిరావటంవల్ల వెంకటదాసు - రామదాసు పెద్దకొడుకు, సంగదాసు అన్న-వర్గశత్రువును సాధించటానికి ఉగ్రవాద క్రియాచరణశీలంతో ధర్మ కన్నా లకు దిగాడు. ఇతనివల్ల కూడా రామదాసు కుటుంబం యింకా కష్టాలేపడింది. కష్టాలకు భయపడక పోవటమే శ్రామికవర్గ చైతన్యలక్షణంగా వాళ్ళయందు చూపించబడింది. రామదాసు కొడుకులు చైతన్యవంతులు కావటం వల్ల తన మిగతాకుటుంబానికి కష్టా

లొస్తున్నాయని వాళ్ళనెప్పుడూ వెనక్కు గుంజలేదు. చిన్నకొడుకు మార్గం ఫలించక పోతే పెద్దకొడుకు మార్గం ఫలిస్తుందో ఏమో చూద్దామన్న ఆశ రామదాసులో ఉంది. అతడు మెట్టవేదాంతిగా పైకి కనిపిస్తున్నా లోపల వర్గచైతన్య లక్షణం ఉండటం వల్లనే జీవితాన్ని ఇంకా ఎదుర్కొనటానికి అందరినీ మించిన ఆయుర్దాయాన్ని అతనికిచ్చాడు నవలా రచయిత.

శ్రామిక జనంనుండే తిరుగుబాటు నాయకత్వం

తక్కెళ్ళ జగ్గడుగా పేరు మార్చుకొని ధర్మకన్నాలకు దిగిన వెంకటదాసు అప్పటికున్న వ్యవస్థా పద్ధతి చట్టం వెలికి వచ్చి దాన్ని భగ్నం చేయటం ద్వారా 'సమతా ధర్మం ప్రపంచమందున స్థాపించటం' లక్ష్యంగా కలవాడు. తక్కెళ్ళ జగ్గని ఈ దృక్పథాన్ని ప్రవచించటంలో ఉన్నవ లక్ష్మీనారాయణగారు పాత వ్యవస్థలో ఉండి దాన్ని మార్చటం సాధ్యం కానప్పుడు ఆ చట్రం నుండి బయటపడి దాన్ని ఎదుర్కొనటానికి ప్రజాబాహుళ్యం నుండే, అంటే శ్రామిక జనం నుండే తిరుగుబాటు నాయకత్వం బయలుదేరుతుందన్న వాస్తవాన్ని సూచన చేశాడు. ఆయనకున్న సమాజాభివృద్ధి చరిత్ర అవగాహన గొప్పది. వెంకటదాసు జగ్గడుగా మారి మందిని కూడగట్టుకొని ధర్మకన్నాలకు దిగాడంటే తిరుగుబాటుకు ప్రేరణ అనుభవం నుండే వస్తుందనీ, జీవన పరిస్థితులే అనుభవాన్నిస్తాయని-అన్నిటికీ మూలంలో ఉన్నది ఆర్థిక పునాది అనీ రచయిత స్పష్టంగా చెప్పినట్లే. వెంకటదాసు విజయం పొందినట్లు చెప్పకపోవటానికి కారణం సామాజిక చైతన్యం యింకా అభివృద్ధి కావలసి వుండటమే. అంటే ఉన్నత వర్గాల ఉపరితల చైతన్యం నుండి బయటపడి తమ అస్తిత్వం పెంపొందించే చైతన్యంతో శ్రామిక జనం క్రమంగా ఉద్వేగాన్నీ ఉత్తేజాన్నీ ఉత్సాహాన్నీ పొందటానికి ప్రోద్బలంగా ఉండటం వరకే వెంకటదాసు కథను ఉన్నవ చూపించాడు.

సామాజిక జీవిత పోరాటాలు ఒకనాటితో తేలేవి కావన్న స్పృహతోనే రచయిత కోర్టులో జగ్గడుగా వున్న వెంకటదాసు తన ఉద్యమాన్ని గురించి చేసిన ప్రకటనగా అంత ఉపన్యాసాన్ని వ్రాశాడు. తుది విజయానికి దారితీసే అసలైన పీడిత జన జీవిత పోరాటానికి జగ్గని తిరుగుబాటు ఒక నాంది మాత్రమే. అంతవరకే ఆయన నవల్లో చెప్పదలుచుకొన్నది. అందులోనే, క్రొత్తగా నిర్మించుకోబోయే సాంఘిక వ్యవస్థ సామ్యవాద దృక్పథం కలిగిన సమతా ధర్మ ప్రాతిపదిక మీద ఉండాలన్న లక్ష్యాన్ని కూడా ఆయన నిర్దేశించాడు. లక్ష్యాన్ని మార్గాన్నీ ఒకపరిణామ క్రమంలో నవల చూపిస్తున్నది.

ఈ నవలలో సారభూతమైన ఈ కథాంశాన్ని ఇలా నిరూపణ చెయ్యటంలో రచయిత యొక్క సమకాలీన సమాజ వాస్తవ జీవిత గతిని గురించిన అవగాహన, అంటే విరుద్ధ శక్తుల సంఘర్షణా పరిష్కారమూ ఎంతో విస్పష్టంగా ఉంది. కులమత రాజకీయ సంస్కరణ దృక్పథం నుండి సాగుతున్న స్వరాజ్య ఉద్యమ గర్భంలో సామ్యవాద సమతాధర్మ పిండాకృతిని సజీవంగా చూపించిన సామాజిక స్పృహ చైతన్యం కలిగిన మొట్టమొదటి తెలుగు నవల మాలపల్లి. (ఆకాశవాణి సౌజన్యంతో)

భయం భయం బతుకు భయం
అన్నా మనకీలోకం పన్నిన పద్మవ్యూహం

బికిని – పసిఫిక్ మహాసముద్రంలో ఒక చిన్న దీవి – అమెరికా తన అణ్వస్త్ర పరీక్షలకోసం ఈ దీవిని ఒకప్పుడు ఉపయోగించుకుంది.

ఆండ్రె కౌటిన్ అని ఒక ఫ్రెంచి పాత్రికేయుడు ఆ దీవివెళ్ళి చూశాడు. అతని మాటల్లోనే చెప్పాలంటే అతను చూసిందిది :

"అదొక ఎడారిలా కనిఫించింది. పసిఫిక్ సముద్రతీరంలో ఉండాల్సిన చెట్టు ఒక్కటీ కనపడలేదు. ఏవో పనికి రాని పిచ్చితుప్పలుమాత్రం నేలమీద పర్చుకున్నాయి. అక్కడ ప్రతి వస్తువూ స్ట్రోంటియం – 90 విషంతో నిండి పోయాయి. కొన్ని చెట్లరకాలే పూర్తిగా నాశనమైపోయి భయంకరమైన కొత్త మొక్కలు లేచాయి. ఇప్పుడిప్పుడే అత్యంత ఆదిమస్థాయిలో జీవితం ఇక్కడ పునరారంభం అవుతోంది. ఇక్కడ చిట్టచివరి అణు ప్రయోగం జరిగి 18 సంవత్సరాలయ్యాక పరిస్థితి ఇది...."

ప్రపంచంలో సామ్రాజ్యవాద దేశాల్లో ఆర్థిక సంక్షోభం భస్మీపటలం చేస్తుంటే ఆ సంక్షోభ భారాన్ని దొరికిన వర్ధమాన దేశాల నెత్తిమీదకెత్తి తాము ఎలాగైనా బయట పడాలని సామ్రాజ్య వాద దేశాలు గింజుకుపోతున్న సమయంలో – యుద్ధ రక్కసి మళ్ళీ తన దాహంతో నాలుకలు చాస్తున్న సూచనలు కనబడుతున్నాయి.

సామ్రాజ్యవాదుల పిచ్చికుక్కల్లా ఆనాడు హిట్లర్, ముసోలినీ, ఫాసిస్టు మూకలు ప్రపంచంమీదకి విరుచుకు పడ్డాయి. ఆ మారణహోమం తలుచుకుంటేనే గుండె ఆగిపోతుంది. మానవత్వం ఆరోగ్యకరమైన మనసు బుద్ధి ఉన్నవారెవరైనా రెండవ ప్రపంచయుద్ధ వినాశనాన్ని తలుచుకుంటే విషాదంతో ఆవేదనతో కుమిలిపోక తప్పదు.

ఇప్పుడు మళ్ళీ సామ్రాజ్యవాదులకు కొత్త బంట్లు తయారౌతున్నారు. సోషలిస్టు దేశాలమీద శాంతి శక్తులమీద విషం కక్కుతున్నారు. ఆవేశం మాత్రమే ఉన్న ఊహ తెలియని 'కసి' కందులను ఆడవిదార్లు పట్టిస్తున్నారు – యుద్ధం కావాలని ఊగిపోతున్నారు. యుద్ధంవచ్చి ప్రపంచంనాశనమైపోతే ఆ బూడిదలోంచి మళ్ళీ పాతరాతి యుగమో ఇంకేదో స్థాపించాలన్న మూర్ఖత్వం అజ్ఞానంతో పేట్రేగిపోతున్నారు, గోడల మీద విరుచుకు పడుతున్నారు. అమెరికా సామ్రాజ్యవాద నామజపమే వారికి పరమపదమై పోయింది.

ఒక్క అమెరికాలో అయిదేళ్ళ క్రితమే ఉన్న వినాశకశక్తి 1945 లో హిరోషిమా, నాగసాకిలమీద వేసిన అణుబాంబులకన్నా ఆరులక్షల రెట్లు ఎక్కువ.

అమెరికన్ శాస్త్రవేత్త డా. లైనస్ పాలింగ్ అంచనా ప్రకారం – పసిఫిక్ ప్రాంతంలో 20 మెగాటన్ను హైడ్రోజన్ బాంబు ఆ ప్రాంత దేశాల ప్రజలందర్నీ హతంచేయడమేగాక, ఆ ప్రభావంవల్ల

కనీసం 5 లక్షలమంది బాల బాలికలు అంగవైకల్యంతోటో లేక నిర్జీవంగానో పుడతారు.

ఇది కేవలం 20 మెగాటన్నుల హైడ్రోజన్‌బాంబు చేయగల వినాశం. ఇక అణుయుద్ధం అంటూ జరిగితే ఏమౌతుందో ఎవరూ ఊహించనుకూడా లేరు.

అణ్వస్త్ర నిపుణులు ఒక విషయం స్పష్టం చేశారు ఇప్పుడు గనక అణ్వా యుధాల పోటీని నిలుపు చేయకపోయి నట్టయితే 1999 నాటికి (అంటే 19 సంవత్సరాలలో) ప్రపంచసాయిలో అణ్వాస్త్రాలను నిరోధించడమనేది – తుపాకులు గంజాయి స్మగ్లింగ్ వంటివి నిరోధించడం అసలు ఎలా అసాధ్యమై పోయిందో అలాగే అణ్వస్త్రాలస్థితికూడా అయిపోతుంది. ఆ సమయానికి సంచుల్లో జేబుల్లో పెట్టుకెళ్ళడానికి వీలయే అణ్వాస్త్రాలు తయారై పోతాయి. అవి ఒక్కొక్కటి 10 లక్షల జవాభాగల నగరాల్ని మొత్తం భస్మీపటలం చెయ్యా ానికి సరిపోతాయి.

ఒకవేళ అదే పరిస్థితి ఏర్పడితే ఆ ఆయుధాలు ఏ మానవ విద్వేషాలు ఏ పిచ్చివాడో సంపాదిస్తే, లేదా ఏ పిల్ల వాడో ఆడుకుంటే మానవ భవిష్యత్తు మాట అలా ఉంచి అసలు జీవించే హక్కుకే ఎంత ప్రమాదం ఏర్పడు తుందో ! ఇప్పటికి చరిత్రకి దొరికిన మేరకు గత 5 వేల సంవత్సరాల కాలంలో జరిగిన 14 వేల యుద్ధాలలో 36 కోట్లమంది మరణించారని అంచనా. అందులో 5 కోట్లమంది రెండవ ప్రపంచ యుద్ధంలోనే మరణించారు.

సోషలిజాన్ని ఎలాగైనా పురిట్లోనే హత్య చేయాలన్న పన్నుగడతో పెట్టు బడిదారులు ప్రయోగించిన కిరాతకసేన పాసిస్టుల్ని అడగించి ప్రపంచాన్ని కలిపిన సమారాటంలో 2 కోట్ల మంది సోవియట్ ప్రజలు హతులయ్యారు.

ఆనాడు ప్రపంచ మారణహోమాన్ని విశ్వ వ్యాపితంగా అభ్యుదయ రచయి తలు నిర్ద్వంద్వంగా ఖండించారు. శాంతి పతాకను ఎగరేశారు. పికాసో పావురాన్ని శాంతి చిహ్నంగా ప్రపంచానికి బహూక రించాడు. ఇప్పుడు పరిస్థితి మళ్ళీ భయంకరంగా తయారైంది. ప్రపంచ జనాభాలో ప్రతిమనిషి నెత్తిన 14 టి. ఎం. టి. ల చొప్పున వేయడానికి సరిపోయే అణ్యాస్త్రాలున్నాయి. ఇది ప్రపంచాన్ని పదిసార్లు తగలబెట్టడానికి సరిపోతుంది.

47 రకాల అణు మారణాయుధాల్లో సరికొత్తవి వచ్చి చేరుతున్నాయి. సామ్రాజ్యవాదం 'ఆస్తి' కాపాడు కోవడం కోసం కేవలం మనుషులు మాత్రమే చచ్చిపోయి, యితర సంపదలు అసలు చెక్కుచెదరకుండా ఉండే న్యూట్రాన్ బాంబుని తయారుచేసిమురిసి పోతోంది.

రెడ్యూస్ రెసిడ్యువల్ రిడక్షన్ బాంబ్ [ఆర్ ఆర్ ఆర్] అనే బాంబు మహా భయంకరమైంది.

ఇవన్నీ అలా ఉంచి సముద్రాల్లో ఉప్పెనలు సృష్టించీ, తుపాన్లలో నదు లకు వరదలు తెప్పించీ, భూకంపాలు కల్పించి మనుషుల్ని లక్షల సంఖ్యలో హత్య చేసేందుకు పథకాలు రాస్తు న్నారు అమెరికా మృత్యుమూకలు ఆత్మరక్షణకోసం అందరూ ఎవరికి తోచి నన్ని ఆయుధాలు వారు పెట్టుకుంటు

న్నారు. ప్రతి నిమిషంలోను ఒక కోటి రూపాయలు ఆయుధాల తయారీకి మరో కోటి రూపాయలు సైన్యం నిర్వహణ కోసం ప్రపంచంలోని ప్రభుత్వాలు ఖర్చు పెడుతున్నాయి.

ప్రపంచ మానవాళికి మరింత శుభ ప్రదమైన సుఖప్రదమైన జీవితానికి తమ మేధో సంపదని, కృషిని అంకితం చేయాల్సిన శాస్త్రజ్ఞులలో ఆరోవంతు మంది మనుషుల్ని చంపే కొత్త ఆయుధాల తయారీలో శక్తి సామర్థ్యాల్ని తాకట్టు పెడుతున్నారు.

అమెరికా వారు ఇటీవలే 850000000000000 అంటే ఎనిమిది న్నర లక్షల కోట్ల రూపాయలు విలువైన నిధులు ఆయుధాలు సైన్యం కోసం కేటాయించింది.

వారికి పాపం ప్రపంచంలో 114 దేశాలలో 2,500 సైనిక స్థావరాలున్నాయి. వాటిలో 5 లక్షల మంది సైనికుల్ని పెట్టింది అయినా చాలదు. ఇంకా కొత్త స్థావరాలను నిర్మించాలని యావత్ అమెరికా సామ్రాజ్యవాద పాలకులైన ఘనత వహించిన పెట్టుబడిదారీ వర్గం ఉత్పత్తులకు లాభాలు సంపాదించి పెట్టడం ఆ ప్రభుత్వ ప్రధాన విధి.

అమెరికాలో మారణాయుధాలు బాంబులు తయారుచేసే ప్రైవేటు ఫ్యాక్టరీలకి లాభాలు రావాలి. మరి అందుకే పెంటగన్ వారు 1 లక్ష 20 వేల ఒప్పందాన్ని ఆయుధ తయారీ పరిశ్రమలతో చేసుకున్నారు.

ఇప్పుడు యుద్ధం అంటూ వస్తే సెకన్లు నిమిషాలమీద సర్వనాశనం అయిపోతుంది. రకరకాల మిసిలీలు పెట్టుకున్నాచున్నారు. వర్ధమాన దేశాల్ని లొంగదీసుకోవడానికి దోపిడీ చేయడానికి సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధ వ్యతిరేక సాంప్రదాయాలకు పేరెన్నిక గన్న అభ్యుదయ రచయితలు పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఈ అణుయుగంలో వాసవాలు ఊహలకు అందని స్థాయిలోనే ఉంటాయి. ఇటీవలే పొరపాటున సిగ్నల్స్ యివ్వడంవల్ల అమెరికాలో కొన్ని నిమిషాలపాటు అంతా యుద్ధానికి సిద్ధమైపోయిన ఘటన తరువాత ఎప్పుడేం జరుగుతుందో ఎవరూ చెప్ప లేని స్థితి.

యుద్ధానికి వ్యతిరేకంగా ఆయుధాల పోటీకి నిల్వలకి వ్యతిరేకంగా మేధావులు ప్రజలు అందరూ గొంతెత్తి నిరసిస్తే అదొక్కటిమాత్రమే ఈమృత్యు వ్యాపారాల కిరాతకాన్నుండి ప్రపంచాన్నిరక్షించ గలుగుతుంది. ప్రపంచ శాంతిసంఘం ఆధ్వర్యాన మేధోరచయితలు ఈ సంవత్సరం మే 8–10 మధ్య బుడాపెస్ట్‌లో సమావేశమై యుద్ధ ప్రమాదాన్ని గురించి ప్రపంచ ప్రజల్ని హెచ్చరించారు.

అభిప్రాయ భేదాల్ని, సిద్ధాంత విభేదాల్ని అన్నిటినీ పక్కకు పెట్టి అందర్నీ ఈ శాంతిగర్జనలు గొంతు కలపాల్సిందిగా ఆహ్వానించింది.

ఆయుధ పోటీని ఖండించే పత్రంపై సంతకాలు చేయమని పిలుపిచ్చింది. హిట్లర్ ఫాసిజంపై విజయం 35 వ వార్షికోత్సవం సందర్భంగా బుడాపెస్ట్ సమావేశం యిచ్చిన పిలుపుతో అభ్యుదయ రచయితలంతా పాలుపంచుకోవాలని అరసం విజ్ఞప్తి చేస్తున్నది.

అభ్యుదయ రచయితల సంఘ కార్యవర్గ, సమితి సమావేశాల నిర్ణయాలు

గత నెలలో హైదరాబాద్‌లో రాష్ట్ర అభ్యుదయ రచయితల కార్యవర్గ సమితి సమావేశాలు శ్రీ తుమ్మల వెంకట్రామయ్య, శ్రీ బూదరాజు రాధాకృష్ణల అధ్యక్షతన జరిగాయి.

యుగపురుషులు శ్రీ కందుకూరి, గురజాడలు నివసించిన గృహాలను వారు నడిపిన సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, రాష్ట్ర రజతోత్సవాల సందర్భంగా వాటిని మ్యూజియంలుగా మార్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

వరంగల్లు జిల్లా బమ్మెర గ్రామంలో బమ్మెర పోతన 'స్మారక చిహ్నాన్ని' నెలకొల్పాలని విజ్ఞప్తి చేస్తూ గతంలో దాని కోసం సేకరించిన నిధులు ఈరోజు వరకు అలానే ఉండిపోయాయని గుర్తు చేసింది.

అరసం ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన 'నవలా సదస్సు' విశాఖలో జరిగిన భాషా సదస్సులను సమీక్షించింది. సాహిత్యలోకాన్ని ఈ సదస్సులు ఆకర్షించాయని సంతృప్తి ప్రకటించింది.

రాష్ట్రంలోని యువ రచయితల కోసం వివిధ జిల్లాలలో సాహిత్య తరగతులు నిర్వహించాలని సమావేశాలు నిర్ణయించాయి. 'సిలబస్'ను రూపొందించేందుకు శ్రీయుతులు బూదరాజు రాధాకృష్ణ, శీలా వీర్రాజు, రాంభట్ల కృష్ణమూర్తి, మల్లెలతో ఒక కమిటీని నియమించింది.

ఆగస్టు 15, 16 తేదీల్లో కడపలో సాహిత్య విమర్శపైనా, నవంబరులో విజయనగరంలో "గత దశాబ్దపు తెలుగు చిన్న కథ" అనే విషయంపై సాహిత్య సదస్సులు జరపాలని నిర్ణయించింది.

సమావేశంలో శ్రీయుతులు తుమ్మల, బూదరాజు, వై. విజయకుమార్, రాంభట్ల, రవి, శీలా వీర్రాజు, చొప్పకట్ల చంద్రమౌళి, సుధాకర్, స్వామి, సంగాల కోటేశ్వరరావు, బోధాయన్, పటుకూరి ప్రసాద్, జాతశ్రీ, జి. యాదగిరి, మైత్రేయ, విద్వాన్ దస్తగిరి, మోహన్, యస్. వి. సత్యనారాయణ, ఆర్. వి రామారావులు ప్రసంగించారు.

గ మ ని క

రానున్నది "సాహిత్య విమర్శ" ప్రత్యేక సంచిక ఎక్కువ పేజీలు, వ్యాసాలు ఉంటాయి కనుక ఈ సంచిక తక్కువ పేజీలలో ప్రచురిస్తున్నాం.

సం॥

సమకాలీన తెలుగు సమాజాన్ని ప్రతిబింబించే

తెలుగు నవలలు

న[illegible]క్రాలు	—యర్రంశెట్టి శాయి	10-00
వెదురు పొదలు నినది చాయ	—జాతశ్రీ	7-00
మనిషికీ మనిషికీ మధ్య ...	—వి. రాజారామమోహనరావు	5-00
స్మశానం దున్నేరు	—డా॥ కేశవరెడ్డి	6-00
శతాబ్దాల నిశ్శబ్దం	—దశరధ్	7-00
బలి పశువు	—జాతశ్రీ	5-00
కోటి కుటుంబాల ఘోష	—కె. బ్రహ్మనందరావు	5-00
సంకెళ్ళు తెగుతాయి	—మల్లిక్	6 00
దేవుళ్లారా మీ పేరేమిటి ?	—శ్రీకాంత్	6-00
కన్నీటికి నోరొచ్చింది	—యస్. కాశీవిశ్వనాధ్	(అచ్చులో)
పిల్లా మనుషులే	—డా॥ వసుచూరి రాజారామ్	6-00

—పోస్టేజి అదనం :—

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

చంద్రం బిల్డింగ్స్ : : విజయవాడ-520 004

బ్రాంచీలు

విశాలాంధ్ర బుక్ హౌస్

విజయవాడ, హైదరాబాద్, అనంతపురం, విశాఖపట్నం,
తిరుపతి, వరంగల్, గుంటూరు.

Edited, Printed & Published By T. Venkataramaiah,
3-6-737/3, HIMAYATNAGAR, HYD-29
Printed at Swatantra Art Printers, Vijayawada - 520004